

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

పారిశుధ్య కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలి

- కనీస వేతనాలు అమలయ్యేలా పర్యవేక్షించాలి
- కార్మికుల ఆరోగ్య భద్రతకు పెద్దపీట వేయాలి
- కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

సుభాష్‌నగర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): అనునిత్యం ప్రజల ఆరోగ్యాలను పరిరక్షించే పారిశుధ్య కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ టి.వినయ్‌కృష్ణారెడ్డి సూచించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన మాన్యువల్ స్కావెంజర్ సర్వే కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులకు అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష జరిపారు. సఫాయి కర్మాచారీలు, పారిశుధ్య కార్మికులకు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడంతో పాటు అర్హులైన వారి పిల్లలకు ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్‌లు అమలయ్యేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రమాదవశాత్తు పారిశుధ్య కార్మికులు మరణిస్తే బాధిత కుటుంబాలకు నష్టపరిహారం అందేలా చొరవ చూపాన్నారు. మాన్యువల్ స్కావెంజర్స్ నిషేధ చట్టం గురించి ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు విస్తృతంగా కృషి చేయాలన్నారు. అపరిశుభ్ర వాతావరణంలో విధులు నిర్వర్తించే కార్మికుల ఆరోగ్య భద్రతను వారి సంక్షేమానికి పెద్దపీట వేయాలని సూచించారు. కార్మికులకు కనీస వేతనాలు అమలయ్యేలా పర్యవేక్షణ జరపాలన్నారు. బీమా సౌకర్యం, పీఎఫ్, ఈఎస్ఐ వంటి సదుపాయాలు వర్తించేలా చూడాలన్నారు. సఫాయి కర్మాచారీలు అందరూ ఆన్‌లైన్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ఎక్కడ కూడా మాన్యువల్ స్కావెంజర్స్ లేరని 1993 నిషేధ చట్టం పకడ్బందీగా అమలవుతుందని జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి రజిత కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ పారిశుధ్య కార్మికుల సేవలను వినియోగించుకోవడం జరుగుతుందన్నారు. నిజామాబాద్ నగర పాలక సంస్థతో పాటు బోధన్, ఆర్మూర్, భీంగల్ మున్సిపాలిటీలు, 545 గ్రామ పంచాయతీల పరిధిలో కార్మికులు ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరించి వాహనాల ద్వారా డంప్ యార్డులకు తరలిస్తున్నారని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అంకిత్, నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ రవిబాబు, సీపీవో రతన్, అధికారులు పాల్గొన్నారు.



ఎంపీకి శుభాకాంక్షలు తెలుపుతున్న వంశీగౌడ్

ఎంపీ అర్వింద్ పసి పిల్లల ప్రాణదాత

- బీజేవైఎం ఇందూరు జిల్లా ఉపాధ్యక్షుడు
- ఎంపీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వంశీ గౌడ్

నిజామాబాద్, ఆగస్టు 25, (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పసి పిల్లల ప్రాణదాత, ఎంతో మంది చిన్నారులకు గుండె ఆపరేషన్లు చేపించి ఆదుకున్న గొప్ప మనసున్న మహరాజు ఎంపీ అర్వింద్ అని బీజేవైఎం ఇందూరు జిల్లా ఉపాధ్యక్షుడు, జక్రాన్‌పల్లి మండల యువ నాయకుడు వంశీగౌడ్ అన్నారు. సోమవారం ఎంపీ అర్వింద్ జన్మదినం సందర్భంగా ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వంశీ గౌడ్ మాట్లాడుతూ.. బూత్‌స్థాయిలో కార్యకర్తలకు ఆర్థిక సహాయం చేస్తూ అన్ని విధాలా ఆదుకుంటున్న గొప్ప వ్యక్తి ఎంపీ అని కొనియాడారు. భవిష్యత్తులో ఆయన మరెన్నో పుట్టిన రోజులు జరుపుకోవాలని వంశీగౌడ్ ఆకాంక్షించారు.

రాయితీపై వ్యవసాయ పనిముట్లు

కోటగిరి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో 2025-26 సంవత్సరానికి గాను రైతులకు రాయితీపై వ్యవసాయ పనిముట్లు అందిస్తున్నట్లు వ్యవసాయ అధికారి రాజు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, మహిళ, చిన్న, సన్నకారు రైతులకు 50శాతం రాయితీ, సాధారణ రైతులకు 40శాతం సబ్సిడీపై రాయితీ యంత్రాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. పనిముట్లు అవసరం అయిన వారు దరఖాస్తు పత్రాలను స్థానిక రైతు వేదికల్లో అందించాలన్నారు.



ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన పార్టీ శ్రేణులు, నాయకులు

జడ్పీపై కాషాయ జెండా ఎగరాలి

- సాధ్యం కాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్
- ఎరువుల కొరతపై బీజేపీని బద్నాం చేస్తున్న బీఆర్ఎస్, కాంగ్రెస్
- బీసీ రిజర్వేషన్లకు బీజేపీ అడ్డు కాదు
- ఓటమి భయంతోనే స్థానిక ఎన్నికలకు రాష్ట్ర ప్రభుత్వం దూరం
- బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు
- బీజేపీలో ఉత్సాహాన్ని నింపిన రాష్ట్ర అధ్యక్షుడి పర్యటన
- జిల్లా పరిషత్ స్థానాన్ని గెలిచి అధిష్ఠానానికి గిఫ్ట్‌గా ఇస్తా : ఎంపీ
- జిల్లాలో ఘనంగా ఎంపీ అర్వింద్ జన్మదిన వేడుకలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్, చిత్రంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, అర్బన్ ఎమ్మెల్యే, పసుపు బోర్డు చైర్మన్, పార్టీ జిల్లా అధ్యక్షుడు

నిజామాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని నిజామాబాద్, జగిత్యాల జిల్లాల జిల్లా పరిషత్‌లపై కాషాయ జెండా ఎగరాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సోమవారం నిజామాబాద్‌లోని శ్రీరామగార్డెన్‌లో పార్లమెంట్ బూత్ స్థాయి కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంతకుముందు ఆయనకు ఇందల్వాయి టోల్‌గేట్ నుంచి బీజేపీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. నగరంలోని నీలకంఠేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ర్యాలీగా శ్రీరామగార్డెన్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ పార్టీ అమలుకు సాధ్యం కాని హామీలు ఇచ్చి ఇప్పుడు ఎరువుల కొరతపై బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు బీజేపీని బద్నాం చేయాలని చూస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో 32 లక్షల మంది రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని ఇప్పటికీ రైతుబంధు సక్రమంగా రావడం లేదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రతీ సంవత్సరం 6వేల చొప్పున మూడు విడతలుగా రైతులకు ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా రాష్ట్రంలోని రైతులందరికి అందజేస్తుందన్నారు. ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పటికీ రాష్ట్రంలో 78 ఇళ్లు మాత్రమే పూర్తి చేసిందని నియోజకవర్గానికి 3500 ఇళ్లు ఎప్పుడు పూర్తి చేస్తుందన్నారు. ఓట్‌చోరీ విషయంలో పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ చేసిన వ్యాఖ్యలను తప్పుబట్టారు. రాష్ట్రంలో 8 ఎంపీ సీట్లు బీజేపీ గెలిస్తే 8 ఎంపీ సీట్లు కాంగ్రెస్ గెలిచిందని అదే అధికారులు ఎన్నికలు నిర్వహించాలని ఇందులో ఓట్ చోరీ ఏముందో జవాబు చెప్పాలన్నారు. (మిగతా 8వ పేజీలో...)

'ప్రజావాణి' వినతులను వెంటనే పరిష్కరించాలి

- టి.వినయ్‌కృష్ణారెడ్డి
- ప్రజావాణి కార్యక్రమానికి 102 వినతులు

8

ఆయిల్‌పామ్‌తో లాభాలు

7



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అంకిత్

విద్యార్థుల సస్పెన్షన్

- ర్యాగింగ్‌కు పాల్పడిన ఐదుగురు విద్యార్థులు ఆరు నెలల సస్పెండ్
- మెడికల్ కళాశాలలో యాంటీ ర్యాగింగ్ కమిటీ సమావేశంలో నిర్ణయం

సుభాష్‌నగర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ మెడికల్ కళాశాలలో జూనియర్ విద్యార్థి రాహుల్‌రెడ్డిని ర్యాగింగ్ చేసిన ఐదుగురు సీనియర్ విద్యార్థులను కళాశాల నుంచి ఆరు నెలల పాటు సస్పెండ్ చేశారు. సోమవారం కళాశాలలో నిర్వహించిన యాంటీ ర్యాగింగ్ కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపల్ కృష్ణమోహన్ వివరాలను వెల్లడించారు. శనివారం రాత్రి మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ 4వ సంవత్సరం చదువుతున్న విద్యార్థి రాహుల్‌రెడ్డిపై సీనియర్లు ర్యాగింగ్ చేసిన ఘటన వెలుగులోకి రాగా విద్యార్థి సంఘాలతో పాటు ప్రజాసంఘాలు ర్యాగింగ్ ఘటనను తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మెడికల్ కళాశాల ఉన్నతాధికారులు స్పందించి యాంటీ ర్యాగింగ్ కమిటీ సమా వేశం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణమోహన్ ఆధ్వర్యంలో ఇన్‌చార్జి సూపరింటెండెంట్ రాములు, శ్రీనివాస్‌రెడ్డి, తదితర అధికారులు ర్యాగింగ్ ఘటనపై సమీక్ష నిర్వహించారు. విద్యార్థి రాహుల్‌రెడ్డి తల్లిదండ్రులు యాంటీ ర్యాగింగ్ కమిటీ ఎదుట హాజరై తమ వాదనలు వినిపించారు.

ఆరు నెలల పాటు..

యాంటీ ర్యాగింగ్ కమిటీ సభ్యులు ఐదుగురు విద్యార్థులను ఆరు నెలల పాటు సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం సమావేశమైన యాంటీ ర్యాగింగ్ కమిటీ సమీక్షలో ఈ నిర్ణయాన్ని తీసుకున్నారు. ఇరువర్గాల వాదనలు విని తక్షణ చర్యల కింద ఐదుగురిని ఆరు నెలల పాటు సస్పెండ్ చేస్తూ హాస్టల్ నుంచి శాశ్వతంగా తొలగించాలని నిర్ణయించారు. తదుపరి చర్యలు పోలీస్ శాఖ సమర్పించిన నివేదిక ఆధారంగా తీసుకోవడం జరుగుతుందని ప్రిన్సిపాల్ కృష్ణమోహన్ తెలిపారు. ఈ సమావేశంలో యాంటీ ర్యాగింగ్ కమిటీ సభ్యులు, అదనపు కలెక్టర్ అంకిత్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో అన్ని పుస్తకాలను అందుబాటులో ఉంచాలి

- విద్యార్థులు, నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలి
- ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

8

- సాలూరలో గ్రంథాలయం, సీఎస్సీ సెంటర్ ప్రారంభం

ఎస్సారెస్పీ గేట్ల మూసివేత

- ప్రాజెక్టుకు తగ్గిన ఇన్‌ఫ్లో
- కాలువలకు కొనసాగుతున్న నీటి విడుదల

7

సోయా రైతులను ఆదుకుంటాం

- ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి భరోసా
- నీట మునిగిన పంటల పరిశీలన

సాలూర, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు నష్టపోయిన సోయాపంట రైతులను ఆదుకుంటామని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి భరోసా ఇచ్చారు. సోమవారం సాలూర మండలంలో పర్యటించిన ఎమ్మెల్యే ఖాజాపూర్ గ్రామ శివారులో నీట మునిగిన సోయాపంటను పరిశీలించారు. సంబంధిత మంత్రులతో మాట్లాడి నివేదికలు సమర్పించి నష్టపరిహారం వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని రైతులకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్ గంగాశంకర్, మార్కెట్ కమిటీ చైర్మన్ చీల శంకర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మందర్నా రవి, ఇల్తెపు శంకర్, ఖాజాపూర్ అశోక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సోయా పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

విద్యుత్ సమస్యలపై సమాచారం అందించాలి



పొలంబాట నిర్వహిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

- ట్రాన్స్‌కో ఏఈ బుజ్జిబాబు

కోటగిరి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): గ్రామాలు, పంట పొలాల్లో విద్యుత్ సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోటగిరి ట్రాన్స్‌కో ఏఈ బుజ్జిబాబు సూచించారు. మండల కేంద్రంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పొలంబాట, పల్లెబాట కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ.. వదులుగా ఉన్న, తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్ల దిమ్మెలు, వంగిన స్తంభాలు, లైన్ క్రాసింగ్ తదితర ప్రమాదకరంగా ఉన్న వాటిని గమనించి స్థానిక లైన్‌మెన్లకు తెలియజేయాలన్నారు. భారీ వర్షాలు, గాలి దుమారాల వల్ల విద్యుత్ తీగలు తెగిపడితే సమాచారం అందించాలన్నారు. విద్యుత్ పనులను సొంతంగా రైతులు, వినియోగదారులు చేసుకోవద్దని, తమ సిబ్బందికి సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే గేటు మధ్యలో నిలిచిన రాయలసీమ ఎక్స్‌ప్రెస్

- భారీగా ట్రాఫిక్ జామ్



గేటు మధ్యలో నిలిచిన రైలు

ఎడపల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రైల్వేగేటు వద్ద సోమవారం భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. రాయలసీమ ఎక్స్‌ప్రెస్ రైలు నిజామాబాద్ నుంచి బోధన్ వెళ్లే సమయంలో రైలులో ఉన్న వ్యక్తులు చైన్ లాగడంతో గేటు మధ్యలో దాదాపు 20 నిమిషాల పాటు రైలు ఆగిపోవడంతో ఇరువైపులా వాహనాలు నిలిచిపోయి భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. నిజానికి తిరుపతి నుంచి నిజామాబాద్ మధ్య నడిచే రైలు నిజామాబాద్ రైల్వే స్టేషన్‌లో స్థలం లేకపోవడంతో బోధన్ వరకు వెళ్లి అక్కడ నిలిపిన తర్వాత నిజామాబాద్ తిరుగు ప్రయాణం అవుతుంది. నిజామాబాద్ నుంచి బోధన్ వరకు ప్యాసింజర్‌లకు అనుమతి లేదు. అయినా కొందరు ఆకతాయిలు ఈ రైలులో అటూ ఇటూ ప్రయాణిస్తుంటారు. అలా రైలు ఎక్కిన కొందరు ఆకతాయిలు రైలు చెన్ లాగడంతో రైల్వేగేటు మధ్యలో నిలిచిపోయి భారీగా ట్రాఫిక్ జామ్ అయింది.



పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

ముప్కాల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): బాల్కొండ మండల కేంద్రంలోని 33 బై 11 కేవీ సబ్ స్టేషన్‌లో నూతనంగా పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను సోమవారం ఆర్మూర్ పీవీ రాజేశ్వర్‌రావు ప్రారంభించారు. ఈ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ద్వారా వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా అందిస్తామని తెలిపారు. గతంలో 3.15 ఎంవీఏ స్థానంలో 5 ఎంవీఏ సామర్థ్యంగల పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌సీ డీఈ వెంకట్‌రమణ, పెర్కిట్ ఏడీ శ్రీనివాస్, ఎంఆర్‌సీ ఏడీ నట్‌రాజ్, బాల్కొండ ఏఈ కిషన్, సబ్ ఇంజనీర్ మహేష్, సుకుమర్, సుందర్‌రావ్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు యువకుల దారుణ హత్య

మాక్లూర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మారం గ్రామంలో వివాహేతర సంబంధం ఇద్దరి ప్రాణాలను బలిగొంది. ఇంటికి రావద్దని బెదిరించినందుకు కక్షకట్టిన ఇద్దరు యువకులు రాడ్లు, కత్తులతో ఆ ఇంటిపై దాడి చేయగా.. ఎదురు తిరిగిన కుటుంబ సభ్యులు ఆ యువకుల కళ్లల్లో కారం చల్లి కత్తులు, రాడ్లతో దాడి చేశారు. దీంతో ఆ యువకుల్లో ఒకరు అక్కడికక్కడే మృతిచెందగా మరొక యువకుడు ఆసుపత్రికి తరలించేలోపే మృతి చెందాడు. దీంతో గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకోవడంతో రెండుచోట్ల పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. స్థానిక ఎస్సై రాజశేఖర్ కథనం ప్రకారం... మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన ఓ మహిళతో జిల్లా కేంద్రంలోని గౌతమ్‌నగర్‌కు చెందిన జిలకర ప్రసాద్ వివాహేతర సంబంధం పెట్టుకుని తరచూ ఆమె ఇంటికి వస్తుండేవాడు. దీన్ని గమనించిన కుటుంబ సభ్యులు, గ్రామస్థులు పలుమార్లు ప్రసాద్‌ను హెచ్చరించారు. అయినా తీరు మారకపోవడంతో ఆదివారం ఉదయం గ్రామానికి చెందిన నడ్పి గంగారాం, సాయిలుతో గొడవకు దిగారు. ఒకరినొకరు దూషించుకున్నారు. నీ అంతుచూస్తానని అక్కడి నుంచి వెళ్లిన జిలకర ప్రసాద్ నిజామాబాద్ చేరుకొని తన స్నేహితుడు ఆకాష్‌తో కలిసి ఫుల్‌గా మద్యం తాగి ఆదివారం అర్ధరాత్రి ధర్మారంలోని గంగారాం ఇంటిపై దాడికి దిగారు. తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లే సరికి గంగారాం కుటుంబ సభ్యులు ఎదురు దాడికి దిగారు. ఆ యువకులు వెంట తెచ్చుకున్న కత్తులు, రాడ్లతో వారిపై ఎదురుదాడి చేశారు. దీంతో జిలకర ప్రసాద్(35) అక్కడికక్కడే మృతి చెందగా అతని స్నేహితుడు ఆకాష్ (27) ఆసుపత్రి తరలించేలోపే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరకొని ఆ యువకుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

బీఆర్ఎస్ సిద్ధాంతానికి కట్టుబడి ఉంటా

▸ కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన విజయ భారతి
▸ ఆలూర్ నుంచి పెద్ద ఎత్తున తరలిన కార్యకర్తలు



కేటీఆర్, జీవన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్న విజయభారతి

ఆలూర్ , ఆగస్టు25 (ఆంధ్రజ్యోతి): దివంగత నాయకుడు ఆలూర్ గంగా రెడ్డి కుమార్తె విజయ భారతి బీజేపీకి రాజీనామా చేసి కేటీఆర్ సమక్షంలో హైదరాబాద్‌లో బీఆర్ఎస్ పార్టీలో సోమవారం చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో కేసీఆర్ చేసిన అభివృద్ధి బీఆర్ఎస్ పార్టీ సిద్ధాతాలు నచ్చి పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆలూర్ మండల బీజేపీ కార్యకర్తలు పెద్ద ఎత్తున ర్యాలీ తీసి హైదరాబాద్ చేరుకొని బీఆర్ఎస్ పార్టీలో చేరారు.

కరాటే పోటీలలో మూడు బంగారు పతాకాలు



గోల్డ్ మెడల్ అందజేస్తున్న దృశ్యం

నవీపేట,ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మారం(ఏ)కు చెందిన నూర హర్షవర్ధన్ అనే విద్యార్థి కరాటే పోటీలలో మూడు బంగారు పతాకాలు సాధించాడు. ఈ నెల 24న చైన్నైలో జరిగిన 4వ షూరిటో చాంపియన్ షిప్ నేషనల్ లెవెల్ కరాటే అండ్ కుబుడో టోర్నమెంట్ 2025 పోటీలలో పాల్గొన్న హర్షవర్ధన్ ఈ పతాకాలను సాధించాడు. ఈ పోటీలను ఒకినావా షూరిటో కరాటే అండ్ కుబుడో అసోసియేషన్ ఆఫ్ ఇండియా వారు నిర్వహించారు. హర్షవర్ధన్ ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. కరాటే పోటీలలో మూడు బంగారు పతాకాలు సాధించిన హర్షవర్ధన్‌ను ధర్మారం(ఏ) గ్రామస్థులు అభినందించారు.

క్రైం సమాచారం

ప్రమాదవశాత్తు కాలువలో పడి వ్యక్తి మృతి

బాన్సువాడటౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు కాల్వలో పడి వ్యక్తి మృతిచెందిన సంఘటన బాన్సువాడలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం డబుల్‌బెడ్‌రూం కాలనీ నివాసుడైన గులాం జిలానీ (47) బాన్సువాడ పట్టణలంలని ఓ బార్లో పనిచేసి రాత్రి సమయంలో ఇంటికి వెళ్లేవాడు. ప్రతీరోజు లాగే ఈ నెల 22న ఉదయం 10 గంటలకు పనికోసం తిరిగి ఇంటికి వెళ్లలేదు. అప్పటినుండి అతని కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం వెతికారు. కానీ అతని జాడ తెలియలేదు. కాగా 25న ఉదయం ప్రెస్ కాలనీలో గల మోరీలో గులాం జిలానీ చనిపోయి ఉన్నాడని కాలనీవాసులు తెలిపారు. తాగిన మైకంలో నడుచుకుంటూ ఇంటికి వస్తూ మార్గమధ్యలో ప్రమాదవశాత్తు మోరీలో పడిపోయి నీటిలో ఊపిరి ఆడక చనిపోయాడని భార్య పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సుంకెట్‌లో విషాదఛాయలు

మోర్తాడ్ , ఆగస్టు25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుంకెట్ గ్రామానికి చెందిన పోతు నరేందర్ ఆర్మూర్‌లో హత్యకు గురయ్యాడని తెలిసి గ్రామస్థులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. గ్రామంలో మెడికల్ నిర్వహించే నరేందర్ కు ప్రజల్లో మంచి పేరుంది. హత్యకు గురయ్యాడని సోమవారం తెలియడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆయన బుధవారం సాయంత్రం మోర్తాడ్ బస్టాండ్ పార్కింగ్‌లో సైకిల్ మోటర్‌ను పెట్టి వెళ్లాడని మాత్రం తెలిసింది. తిరిగి రాకపోవడంతో రెండు రోజులు వేచి చూసి కుటుంబ సభ్యులు మోర్తాడ్ పోలీస్ స్టేషన్‌లో అదృశ్యమయ్యాడని ఫిర్యాదు చేశారు. బుధవారం వెళ్లిన నరేందర్ గురువారం ఉదయం ఆర్మూర్‌లోని ఒక ఇంటి నుండి ఇద్దరు వ్యక్తులు నరేందర్ మృతదేహాన్ని బట్టలో మూటకట్టి బైక్‌పై తీసుకెళ్లినట్లు సీసీ కెమెరా ద్వారా పోలీస్‌లు గుర్తించినట్లు సమాచారం. కిడ్నాప్ చేసి చంపారా, అతని వద్ద ఉన్న బంగారు పేరు , ఉంగరం, డబ్బుల కోసం హత్య చేశారా తెలియాల్సి ఉంది. సోమవారం సుంకెట్‌లో జరిగిన అంత్యక్రియల్లో ఊరుఊరంత పాల్గొన్నారు. ఎక్కడ చూసిన ఆయన గురించే చర్చించుకోవడం కనిపించింది.

విద్యుదాఘాతంతో రైతు మృతి


శ్రీనివాస్(ఫైల్)

నసురుల్లాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): నస్రులాబాద్ మండలంలోని నెమలి గ్రామానికి చెందిన బొబ్బిలి శ్రీనివాస్ (37)సంవత్సరాలు సోమవారం తనపొలంలో కరెంట్ షాక్‌తో మృతిచెందిన సంఘటన చోటు చేసుకుంది.ఎస్సై రాఘవేంద్ర తెలిపిన కథనం ప్రకారం..ఉదయంపొలానికిమందు చల్లడానికి వెళ్లి, బోర్ వేసే సమయంలో అకస్మాత్తుగా విద్యుదాఘాతం తగిలిఅక్కడికక్కడే మృతిచెందడంజరి గిందన్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ఏరియా ఆసుపత్రికి తరలించి, కుటుంబ సభ్యుల ఫిర్యాదుమేరకు కేసునమోదు చేసు కుని దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతుడికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు.

పశువుల కొట్టం దగ్ధం

▸ ఏడు పశువులు సజీవ దహనం


దగ్ధమైన పశువుల కొట్టం

బీర్కూర్,ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండలం తిమ్మాపూర్ గ్రామంలో వెంకట్‌రావు అనే రైతుకు తన ఇంటి సమీపంలో రేకుల షెడ్డు ఉంది.దీన్ని పశువుల కోసం వాడుకుంటున్నాడు. ఇదిలా ఉండగా సోమవారం తెల్లవారు జామున విద్యుత్ ఘాతంతో నిప్పంటుకుని పశువుల కొట్టం పూర్తిగా దగ్ధం అయ్యింది. ఈ ఘటనలో మూడు గేదెలు, రెండు ఆవులు, రెండు లేగ దూడలు సజీవ దహనమయ్యాయి. సోమవారం తెల్లవారు జామున పశువుల కొట్టంలో విద్యుత్ తీగలను ఎలుకలు కొరకడం వల్ల మంటలు వ్యాపించాయని కొట్టంలో ఉన్న కట్టెలకు నిప్పు అంటుకుని దీంతో కొట్టం పూర్తిగా దగ్ధం అయ్యిందని బాధితుడు తెలిపారు. మంటలను ఆర్ప డానికి ప్రయత్నించినా షెడ్డు పూర్తిగా దగ్ధం అయ్యిందని, గేదెలు, ఆవులు, లేగ దూడలను కాపాడలేకపోయామని అన్నారు. అనంతరం ఆర్‌ఐ విజయ్ కుమార్, పశు వైద్యాధికారి మారుతి, గ్రామ పంచాయతీ కార్యదర్శి నవీన్‌లు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పంచనామా నిర్వహించారు. ఈ ఘటనలో 9 లక్షల మేరా ఆస్తి నష్టం వాటిల్లిందని వారు తెలిపారు.

దాడి కేసులో ఇద్దరిపై కేసు నమోదు

కోటగిరి,ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): పోతంగల్ మండలంలోని కొల్లూర్ గ్రామానికి చెందిన ప్రశాంత్, లక్ష్మణ్ అనే వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు కోటగిరి ఎస్సై సునీల్ తెలిపారు. కొల్లూర్ గ్రామానికి చెందిన నాగనాథ్, అతని తమ్ముడు లక్ష్మణ్ అనే వ్యక్తి పొలంగట్టు విషయంలో గొడవలు ఉన్నాయి. నాగనాథ్ సోమవారం పొలానికి వెళ్లగా నాగనాథ్ తమ్ముడి కొడుకులు ప్రశాంత్, వైభవ్ గొడవ పడ్డారు.ప్రశాంత్, లక్ష్మణ్ అనే తండ్రి కొడుకులు నాగనాథ్‌పై కర్రతో దాడి చేశారు. ఈ ఘటనలో నాగనాథ్ తలకు గాలయాలయ్యాయి. నాగనాథ్ తనయుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రేషన్ డీలర్ల కమీషన్ ఇప్పించాలని వినతి


భీమ్‌గల్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న రేషన్ డీలర్లు

వేల్పూర్/రుద్రూరు/భీమ్‌గల్,ఆగస్టు25 (ఆంధ్రజ్యోతి): తమకు గత ఐదు నెలలుగా ప్రభుత్వం ద్వారా రావాల్సిన కమీషన్ డబ్బులు ఇప్పించాలంటు సోమవారం వేల్పూర్ మండల గ్రామాల రేషన్ డీలర్లు తహసీల్దార్ శ్రీనివాస్, డీటీ శ్రీకాం త్‌లకు వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం ఆదేశాల ప్రకారం గత ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు లబ్ధిదారులకు రేషన్ బియ్యం అందజేసినప్పటికి తమకు ఇప్పటి వరకు కమీషన్ డబ్బులు రాలేవన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం వేరువేరుగా కమీషన్ విడుదల చేయడం వల న తాము చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని డీల ర్లు పేర్కొన్నారు. గతంలో రెండు ప్రభుత్వాలకు సంబం ధించి ఒకేసారి కమీషన్ విడుదల చేసిన విధంగానే ప్రస్తుతం కూడా పాత పద్దతిలో కమీషన్ విడుదల చేయాలని వారు వినతి పత్ర ద్వారా పేర్కొన్నారు. ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు రేషన్ డీలర్ల కమీషన్ ఇప్పించాలంటూ రుద్రూర్ మండల రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద డిప్యూటీ తహసీల్దార్ సురేందర్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్లు రాములు, ఎండీ సాజిద్, వేద వ్యాస్, నాగయ్య, సీహెచ్ శంకర్, నరేష్, ఎం.శంకర్ పాల్గొన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా రేషన్ డీలర్లకు అందాల్సిన పాత బకాయిలను ప్రభుత్వం వెంటనే అందించాలని భీమ్‌గల్ మండల రేషన్ డీలర్ల సంఘం నాయకులు బుచ్చయ్య, దైడి మురళిలు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం పట్టణ కేంద్రంలోని బడా భీమ్‌గల్ చౌరస్తా వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం రేషన్ డీలర్లకు గౌరవ వేతనంగా రూ. 5వేలు అందించి 300 రూపాయల బోనస్ అందించాలన్నారు. హమాలీల పది రూపాయల చార్జీలను ప్రభుత్వమే భరించి ఐదు నెలల కమిషన్‌ను వెంటనే విడుదల చేసి ప్రతీ రేషన్ డీలర్‌కు హెల్త్‌కార్డు అందించాలన్నారు. ఈ నిరసనలు డీలర్లు బెజ్జోర శ్రీనివాస్ సురేష్ దత్తు, ప్రభు దేవేందర్, మంగ్యా నాయక్ తదితరులు ఉన్నారు.

ఘనంగా ఎంపీ జన్మదిన వేడుకలు


ఎంపీ కలిసిన నాయకులు

బోధన్/రెంజల్/ముప్కాల్,ఆగస్టు25(ఆంధ్రజ్యోతి):జిల్లాబీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ జన్మదినం సందర్భంగా మండలంలోని అమ్దాపూర్ గ్రామంలోని జగజ్జనని, మహంకాళి ఆలయంలో ఎంపీ ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఊట్‌పల్లి, కల్దుర్కి పాఠశాలల్లో కేక్‌కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ ధర్మపురి అరవింద్ బీజేపీ రాష్ట్ర నాయకులు మేడపాటి ప్రకాష్ రెడ్డి, వడ్డీ మోహన్‌లు కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు సిర్ప సుదర్శన్, మాజీ అధ్యక్షులు మనోహర్, బీజేపీ నాయకులు లక్ష్మారెడ్డి, వెంకటేష్, మోహన్ రెడ్డి, సంజీవ్ రెడ్డి, జీలకర్ర ప్రవీణ్, శక్తి కేంద్రాల ఇన్‌చార్జులు, బూత్ అధ్యక్షులు పాల్గొన్నారు. పాఠశాల విద్యార్థులకు సోమవారం బీజేపీ మండల అధ్యక్షులు క్యాతం యోగేష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పండ్లను పంపిణీ చేశారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ జన్మదినం సందర్భంగా విద్యార్థులకు పండ్లను పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఎంపీ అరవింద్ ఇలాంటి ఎన్నో జన్మదిన వేడుకలు జరుపుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మాజీ జిల్లా ఉపాధ్యక్షులు సంతోష్, బీజేవైఎం అధ్యక్షులు పాల్గొన్నారు.

గుత్ప ద్వారా సాగునీటిని విడుదల చేయాలి

ఆర్మూర్, ఆగస్టు25 (ఆంధ్రజ్యోతి): గుత్ప ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీటిని వెంటనే విడుదల చేయాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అల్లూరి గంగారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణలో అతితక్కువ వర్షపాతం ఆర్మూర్ డివిజన్ పరిధిలోనే ఉందని చెరువులు పూర్తిగా నిండకపోవడంతో పంటకునీరుఎంతో అవసరమన్నారు.నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు అనాస్ ఎంపిక

నందిపేట, ఆగష్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వన్నెల్(కె) గ్రామానికి చెందిన అనాస్ అనే విద్యార్థి రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనాడు. ఇటీవల జిల్లా కేంద్రంలోని నాగారాంలో జరిగిన అండర్-14 అథ్లెటిక్స్ మీట్‌లో 60 మీటర్ల పరుగు పందెంలో స్వర్ణ పతకం సాధించాడు. అలాగే లాంగ్‌జంప్, బ్యాక్‌త్రోలో కాంస్య పతకాలు సాధించాడు. ఈ నెల 30న హనుమకొండలో జరిగే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో అనాస్ పాల్గోనున్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఒకరి అరెస్టు

ఆర్మూర్ టౌన్, ఆగస్టు25 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలోని ఆలూర్ బైపాస్ రోడ్డులో సోమవారం మధ్యాహ్నం పెర్కిట్ గ్రామానికి చెందిన షేక్ ఖలీద్ అనే వ్యక్తి గంజాయి విక్రయిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. అతని వద్ద నుంచి నాలుగు గంజాయి ప్యాకేట్లు సుమారు 36 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు.షేక్ ఖలీద్ మహా రాష్ట్రంలోని మాలేగావ్ గ్రామం నుంచి 20 ప్యాకేట్లు తీసు కు వచ్చి ఆర్మూర్ ప్రాంతంలో విక్రయిస్తున్నాడని తెలి పారు. కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రోటరీ సేవలను విస్తరించాలి

ఆర్మూర్, ఆగస్టు25 (ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ అందిస్తున్న సేవలు మారుమూల గ్రామాలకు విస్తరించాలని రోటర్లీ డిస్టిక్ మాజీ గవర్నర్ ఎన్వి హన్మంత్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆర్మూర్‌లో నిర్వహించిన రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ నూతన కార్యవర్గ సభ్యుల పదవి ప్రమాణ స్వీకారానికి ముఖ్య అతిథిగా హాజరై నూతన అధ్యక్షుడు జక్కుల రాధాకిషన్,కార్యదర్శి ఖాందేష్ సత్యం తదితరుకు ప్రమాణ స్వీకారం చేయించారు ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు


పార్టీలోకి ఆహ్వానిస్తున్న ముత్యాల సునీల్‌కుమార్

భీమ్‌గల్ రూరల్, ఆగస్టు25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోన్‌గొప్పుల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు దేశబోయిన సత్యనారాయణ, కొమ్ము మల్లేష్, కేతవత్ రాజ్‌కుమార్, మాలవత జగన్ సోమవారం బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర పురోగతిని దృష్టిలో ఉంచుకుని కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలకు ఆకర్షి తులై పార్టీలో చేరడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్ర మంలో మండలకాంగ్రెస్‌పార్టీ నాయకులు స్వామి, దేవేందర్, అనంత్‌రావ్, రమేష్, రాగులు మోహన్ పాల్గొన్నారు.

వ్యవసాయ యాంత్రీకరణ పై దరఖాస్తులు

ఆలూర్,ఆగస్టు25(ఆంధ్రజ్యోతి):రైతుల కోసం వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద రాయితీపై పరికరాల దరఖాస్తుల స్వీకరణ నేటి నుంచి ప్రారంభం అయిందని ఆలూర్ వ్యవసాయాధికారి రామ్‌బాబు తెలిపారు. జిల్లాకు మొత్తం 6742 యూనిట్లు కేటాయించగా మొదటి విడతగా రూ. 1.67 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. ఈ పథకం కింద పదకొండు రకాల వ్యవసాయ పరికరాలకు సబ్సిడీ వర్తించనుందని చెప్పారు. భూమి కలిగిన ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారులు రైతులు, మహిళా రైతులకు 50 శాతం సబ్సిడీ లభిస్తుంది. దరఖాస్తు చేసుకునే సమయంలో రైతులు పట్టాపాస్‌బుక్, ఆధార్ కార్డు ఇవ్వాలి. గతంలో లబ్ధిపొందని రైతులకు ప్రాధాన్యత ఇవ్వబడతుందన్నారు. ఎంపికైన లబ్ధిదారుకు పరికరాలు సరఫరా చేసే కంపెనీ పేరుతో డీడీ తీసుకురావాలని వ్యవసాయ అధికారి రామ్‌బాబు తెలిపారు.

నలుగురికి నాలుగు రోజుల జైలు శిక్ష

సుభాష్‌నగర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి):శాంతి భద్రతలకు విఘాతం కలిగించిన నలుగురికి నాలుగు రోజుల జైలు శిక్ష విధిస్తూ సెకండ్ క్లాస్ స్పెషల్ న్యాయాధికారి ఉత్తర్వులు జారీ చేశారు. శనివారం రాత్రి నగరంలోని సాయిమెస్ వద్ద విశాల్, గోవింద్, సాయికుమార్, నవనాత్ అనే వ్యక్తులు శాంతిభద్రతలకు ఆటంకం కలిగించారని అన్నారు. వీరిపై సిటీ పోలీస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి జడ్జి ముందు హాజరుపర్చగా నాలుగు రోజుల పాటు జైలు శిక్ష విధించి తీర్పు వెల్లడించినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు.

నేడు మండలానికి ఎమ్మెల్యే రాక

రెంజల్,ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): నేడు మండలంలోని కల్యాపూర్, కందకుర్తి గ్రామాలలో లబ్దిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పట్టాలను ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేయడం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మొబిన్ ఖాన్ తెలిపారు. కళ్యాపూర్, కందకుర్తి గ్రామంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను లబ్దిదారులకు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

సిరికొండ,ఆగస్టు25(ఆంధ్రజ్యోతి):సిరికొండ మం డలం కొండూర్ గ్రామంలో జరిగిన ప్రమాదంలో చెల్లెం ల క్ష్మి (65)చికిత్స కోసం నిజామాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయినట్లు గ్రామస్తులు చెప్పారు.కొండూర్ గ్రామంలో సోమువారం నాడు బార్యభర్తలు మోటర్ బైక్‌పై వెల్తుండగా అదే గ్రామానికి చెందిన మరోక యువకుడు మొటర్‌బైక్‌పై పాఠశాల వద్ద ఎదురుగా వస్తు తగిలించడం వల్ల చెల్లెం గంగాయ్య, ఆయన బార్య చెల్లెం లక్ష్మీ బైక్‌పై నుంచి పడిపోయారు. ఈ ప్రమాదంలో లక్ష్మి తలకు బలమైన దెబ్బ తగలడంతో కోమాలలోకి వెళ్లినట్లు చెప్పారు.మెరుగైన చికిత్సా నిమిత్తం నిజామాబాద్ ఆసుపత్రికి తరలిస్తుండగా ల క్ష్మి మార్గమద్యలో చనిపోయినట్లు గ్రామస్తులు చెప్పారు. లక్ష్మికి ఇద్దరు కుమారులు, ఒక కూతురు, మనుమలు, మనుమరాల్లు ఉన్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిరికొండ ఎస్సై జాడీ రామకృష్ణ తెలిపారు. శవ పంచానామ చేసి పోస్టుమార్టం కోసం ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

సురక్షితంగా బయటపడ్డ పశువుల కాపరులు

▸ శ్రమించిన పోలీసులు ఫైర్ సిబ్బంది ▸ 30 మేకలు గొర్రెలు నాలుగు గేదెలను ఒడ్డుకు చేర్చిన పోలీసులు, ఫైర్ సిబ్బంది


సురక్షితంగా బయటపడ్డ గొర్రె, గేదెల కాపరులతో పోలీసులు


మంజీరా నది నుంచి బయట పడ్డ గొర్రె, మేకలు

నిజాంసాగర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): 48 గంటల విరామం తర్వాత మళ్లీ నిజాంసాగర్ సోమవారం నాడు ఎత్తివేశారు. మంజీరా వెంట ఉన్న మగ్దుంన్పూర్ గ్రామానికి చెందిన అస్గర్ బండారి రాములు కలిసి లేక గొర్రెలతో పాటు గేదెలను కూడా మంజీరా నది ఒడ్డుకు మేపడానికి వెళ్లారు. సోమవారం ఉదయం నిజాంసాగర్ నీటిని వదలడంతో మంజీరా నదిలో గొర్రె మేకలు బండ్లు చిక్కుకుపోయాయి. పోలీసులకు సమాచారం అందగానే నీటిపారుదల శాఖ అధికారులు నిజాంసాగర్ వరద గేట్లను మూసివేయాలని కోరారు. దీంతో నీటి పారుదల శాఖ అధికారులు వరద గేట్లను మూసివేయడంతో పోలీసులు ఫైర్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని గేదె, గొర్రె మేకలను ఒడ్డుకు చేర్చారు. పోలీసులు ఫైర్ సిబ్బంది దాదాపు నాలుగు గంటలపాటు శ్రమించి మేక గొర్రెల గేదెలతో పాటు కాపరులు సురక్షితంగా బయటకు తీసుకోవచ్చారు. సంఘటన స్థలాన్ని బాన్సువాడ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ తిరుపతయ్య, సబ్ ఇన్స్పెక్టర్ శివకుమార్‌తో పాటు పై సిబ్బంది చేరుకొని హుటాహుటిన గేదె మేకలతో కాపరులు బయటకు తీసుకురావడం పట్ల ప్రజలు ప్రశంసించారు.

సిద్దుల గుట్టపై ఘనంగా పల్లికీ సేవా

పెర్కిట్,ఆగస్టు25(ఆంధ్రజ్యోతి):పట్టణంలో ప్రసిద్ధి గాంచిన నవనాథ సిద్దుల గుట్టపై సోమవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పల్లకీ సేవా, ప్రత్యేక పూజలు ఘనం గా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులు బి. సుమన్, పీసీ గంగారెడ్డి, కొడిగెల మల్లయ్య, చరణ్‌రెడ్డి, బోండ్లఆనంద్, రవి, బట్టు శంకర్, ప్రశాంత్‌గౌడ్, సిద్దుల గుట్ట సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు

నందిపేట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌కు తరలి వెళ్లారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ స్టేట్ కౌన్సిల్ సభ్యురాలు ఆలూరు విజయ భారతి బీఆర్ఎస్ పార్టీలో చేరనున్నారు.

సంక్షేమ పథకాలు అందించాలి


మాట్లాడుతున్న బ్రాహ్మణ సేవా సమాజ్ నాయకులు

బోధన్,ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణ సమాజంలో అర్హులైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలలో మొదటి ప్రాధాన్యత కల్పించాలని వేద పండితులు ప్రవీణ్ మహరాజ్ అన్నారు. సోమవారం బోధన్ పట్టణంలోని ఏకచక్రేశ్వర ఆలయంలో రాష్ట్రస్థాయిలో అత్యున్నత పదవి లభించిన సందర్భంగా ఆయనకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలలో అర్హులైన బ్రాహ్మణులకు మొదటి ప్రాధాన్యత కల్పించాలని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ప్రభుత్వానికి తెలియజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ వీసీడీ చైర్మన్ గంగాధర్ రావు పట్వారీ, బోధన్ ఏసీపీ శ్రీనివాస్, సీఐ వెంకట నారాయణ, శివాలయం చైర్మన్ హరికాంత్ చారి, మారుతి మందిరం చైర్మన్ గుండెటి శంకర్, ప్రదీప్ గుప్తా, బ్రాహ్మణ సేవా సమాజ్ గౌరవ అధ్యక్షులు వినోద్ పట్వారీ, ఉమానంద్ వైద్య, మహిళ అధ్యక్షురాలు మనోజ్ మనీషా వైద్య, ఏకచక్ర తిరంగ సమితి అధ్యక్షులు అంకు మహేష్, మాజీ కౌన్సిలర్ దాము, అంకు సంతోష్ రెడ్డి, బీర్కూర్ బుజ్జి శంకర్, శ్రీనివాస్, సంగ్రామ్, శేఖర్, తేళ్ల కిరణ్, లక్ష్మణ్ రావు, మాదవరావు తదితరులు పాల్గొన్నారు.

లక్కోరలో పీహెచ్‌సీ నిర్మాణానికి భూమిపూజ

వేల్పూర్, ఆగస్టు25 (ఆంధ్రజ్యోతి):మండ లంలక్కోర గ్రామంలో నిర్మించనున్నా ప్రైమరి హెల్త్ సెంటర్ భవనానికి సోమవారం ఎంపీడీవో బాలకిషన్, డీటీ శ్రీకాంత్ భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి డీఎంఅండ్‌హెచ్‌వో రమేష్, వేల్పూర్ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ వీణ, పీహెచ్‌సీ ఇంచార్జి భాగ్య, ఏత శ్రీనివాస్, జీపీ కార్యదర్శి విజయ్‌కుమార్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ ఆత్మరాం, పీఏసీఎస్ వైస్ చైర్మన్ శ్రీధర్, కాంగ్రెస్ నాయకులు, ఆశవర్కర్లు, పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ సెమిస్టర్ ఫలితాల విడుదల

డిచ్‌పల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి):తెలంగాణ విశ్వవిద్యాలయంలోని పీజీ ఇంటిగ్రేటెడ్ మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ 6వ సెమిస్టర్ రెగ్యూలర్ పరీక్షల ఫలితాలను సోమవారం రిజిస్ట్రార్ ఎం.యాదగిరి, కంట్రోలర్ కె.సంపత్‌కుమార్, అడిషనల్ కంట్రోలర్ టి.సంపత్ కుమార్‌లతో కలిసి విడుదల చేశారు. 26 మంది విద్యార్థులకు 25 మంది ఉత్తీర్ణులు కాగా ఒక విద్యార్థి ఫెయిల్ అయ్యారని తెలిపారు. పూర్తి వివరాల కోసం విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌ను సందర్శించాలని అన్నారు.

పోతంగల్‌లో తాళం వేసిన ఇంట్లో చోరీ

కోటగిరి,ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): పోతంగల్ మండల కేంద్రంలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగినట్లు ఎస్‌ఐ సునీల్ తెలిపారు. పోతంగల్ గ్రామానికి చెందిన రాములు అనే వ్యక్తి ఆదివారం బంధువుల ఇంటికి వెళ్లాడు. సోమవారం ఉదయం ఇంటికి తిరిగి వచ్చి చూసేసరికి తాళం పగులగొట్టి ఉండడంతో లోపలికి వెళ్లి చూడగా బీరువా తాళం పగులగొట్టి ఉంది. బీరువాలో రెండున్నర తులాల బంగారు ఆభరణాలతో పాటు 38తులాల వెండి ఆభరణాలు గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించారు. రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు కోటగిరి ఎస్‌ఐ తెలిపారు.

విద్యార్థులకు అవగాహన కల్పించాలి

నిజామాబాద్‌లీగల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి):ర్యాగింగ్ చట్టపరంగా నేరం ఒక కళాశాలలో రెండు రోజుల క్రితం జరిగిన ఘటనకు సంబంధించిన వివరాలను యాంటీ ర్యాగింగ్ కమిటీ సభ్యుల నుంచి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి ఉదయ భాస్కర్ రావు మాట్లాడుతూ. సీనియర్లు జూనియర్లను ర్యాగింగ్ పాల్పడకుండా కమిటీ ప్రతినిధులు విస్తృ తంగా ప్రచారం చేయాలన్నారు. అవగాహన కార్యక్రమాలతో పాటు వాల్ పోస్టర్లను ఏర్పాటు చేయాలని తెలిపారు.ఎవరైనా ర్యాగింగ్ పాల్పడితే లీగల్‌సెల్ 9440901057కు సంప్ర దించాలని సూచించారు. సమావేశంలో లీగల్ ఎయిడ్ కౌన్సిల్స్ రాజ్‌కుమార్ సుబేదార్, బాలాజీ, విశ్వక్ తదిత రులు పాల్గొన్నారు.

రెండు ఇసుక వాహనాల పట్టివేత

కోటగిరి,ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): పోతంగల్ మండలంలోని సోంపూర్ గ్రామంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు వాహనాలను పట్టుకున్నట్లు కోటగిరి ఎస్‌ఐ సునీల్ తెలిపారు. సాలూర మండలం హున్స నుంచి ఇసుకను టాటా వాహనంతో పాటు మరో చిన్న ఆటోలో ఇసుకను నింపి అక్రమంగా తరలిస్తుండగా సోంపూర్ గ్రామంలో స్థానికులు వాహనాలను పట్టుకుని పోలీసులకు సమాచారం అందించారు. వాహనాలను స్టేషన్‌కు తరలించి డ్రైవర్‌తో పాటు యాజమానులపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బోధన్‌లో పిచ్చి కుక్క స్వైర విహారం

● ఐదుగురికి గాయాలు

బోధన్,ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని సోమవారం గోశాల వద్ద పిచ్చి కుక్క స్వైర విహారం చేస్తూ ఐదుగురికి గాయపర్చింది. చికిత్స నిమిత్తం బోధన్ ఏరియా ఆసుపత్రికి తరలివెళ్లారు. ఇటీవల కాలంలో కుక్కలస్వైర విహారం అధికమైందన్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి కుక్కలను నియంత్రించాలన్నారు.

క్రీడా పోటీల నిర్వహణపై సమావేశం


సమావేశానికి హాజరైన హెచ్‌ఎంలు, పీడీలు

ఆర్మూర్, ఆగస్టు25 (ఆంధ్రజ్యోతి): ఆలూర్ మండల అంతర్ పాఠశాలల క్రీడా పోటీల నిర్వహణపై సోమవారం ప్రధానోపాధ్యాయులు, వ్యాయమ ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఆలూర్ మండల అంతర్ పాఠశాల క్రీడోత్సవాలను వచ్చేనెల 16, 17, 18 తేదీలలో నిర్వహించాలని నిర్ణయించినట్లు ఎంఈవో నరేందర్ తెలిపారు. క్రీడల నిర్వహణ కన్వీనర్‌గా హెచ్‌ఎ నరేందర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఫిజికల్ డైరెక్టర్ రాజేష్ వ్యవహరిస్తారన్నారు. సమావేశంలో వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు, పీడీలు పాల్గొన్నారు.

బోధన్ మున్సిపాలిటిలో పరిశుభ్రతపై ప్రత్యేక శిక్షణ

బోధన్,ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని మున్సిపాలిటీలో వీధి వ్యాపార విక్రేతలకు పరిశుభ్రతపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఫుడ్ సెఫ్టీ ఇన్‌స్పెక్టర్ సునీత మాట్లాడుతూ వీధి ఆహార విక్రేతలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. పరిశుభ్రతను పాటించడం వల్ల ప్రజారోగ్యాన్ని కాపాడవచ్చన్నారు. అనంతరం ఎన్ఏఎస్‌వీఐ రాష్ట్ర అధ్యక్షుడు రంగ చాలివాన్ మాట్లాడుతూ గత 26ఏళ్లగావీధి విక్రేతలహక్కుల కోసం పోరాటం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బోధన్ మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ, మెప్మా టీఎంసీశ్రీనివాస్, ట్రైనర్‌పొన్నాల దినాకర్,రాజుకుమార్‌లతో మహిళలుపాల్గొన్నారు.

భారీ గణనాథులతో ట్రాఫిక్ జామ్

పెర్కిట్, ఆగస్టు25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వినాయక చవితి పురస్కరిం చుకొని భక్తులు దూర ప్రాంతాల నుంచి భారీ గణనాథులను మండపాలకు తరలిస్తున్నారు. ఈ సందర్భంగా భారీ గణనాథులతో రోడ్డు మొత్తం నిండిపోయి ఆర్టీసి బస్సులకు, ఇతర వాహనాలకు సమస్యలు తలెత్తాయి.

పేదలకు బియ్యం పంపిణీ

ఆర్మూర్ టౌన్, ఆగస్టు25 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలోని జిరాయత్ నగర్‌లోని విద్యాహైస్కూల్‌లో సోమవారం రక్ష స్వచ్చంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పేదలకు ఉచిత బియ్యం పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు ఖాందేష్ శ్రీనివాస్,ప్రధాన కార్యదర్శి విద్యా ప్రవీణ్‌పవార్, ఉపాధ్యక్షుడు జిందం నరహరి, ఎస్‌జీ శ్రీకాంత్, కోశాధికారి గోనే శ్రీధర్, గంగాధర్, తులసి పట్వారి, మీరా శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

108 అంబులెన్స్‌లో ప్రసవం


శిశువును బంధువులకు ఇస్తున్న అంబులెన్స్

ఆర్మూర్,ఆగస్టు25 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండలం ఖానాపూర్ గ్రామానికి చెందిన గర్భిణులు 108 అంబులెన్స్‌లో సోమవారం ప్రసవించింది. చెంచమ్మ అనే గర్భిణీకి పురిటి నొప్పులు రావడంతో 108 అంబులెన్స్‌లో ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించే క్రమంలో మార్గమధ్యంలో పురిటి నొప్పులు రావడంతో అంబులెన్స్‌లోనే ప్రసవించింది. తల్లిబిడ్డ క్షేమంగా ఉన్నట్లు అంబులెన్స్ సిబ్బంది త్రిష రాజయ్య తెలిపారు.

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా సురేందర్


సురేందర్(ఫైల్)

డొంకేశ్వర్,ఆగస్టు25 (ఆంధ్రజ్యోతి): డొం కేశ్వర్ మండల కేంద్రానికి చెందిన పోతు గంటి సురేందర్ బీజేపీ పార్టీ జిల్లా ఉపాధ్య క్షుడిగా నియమితులయ్యారు. జిల్లా పార్టీ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు రామ్ చందర్‌రావు చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందజేశారు. ఆర్‌ఎస్ఎస్ కార్యకర్తగా సంఘ కార్యనిర్వాహక బాధ్యతలు నిర్వహించి, ఎంపిటీసీగా ఎన్నికై, మండల అధ్యక్షుడిగా కొనసాగి జిల్లా కార్య దర్శిగా బాధ్యతలు చేపట్టి నేడు ఉపాధ్యక్షుడి గా నియామకమయ్యారు.

101 మట్టి గణపతి ప్రతిమల పంపిణీ


మట్టి గణపతి ప్రతిమల పంపిణీ చేస్తున్న దృశ్యం


నందిపేట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తల్వేద గ్రామంలో సోమవారం మట్టి వినాయకుడిని పూజించండి-ప్రకృతిని కాపాడండి అనే నినాదంతో మట్టి గణపతి ప్రతిమలు పంపిణి డాక్టర్ సాత్విక రెడ్డి ఉచితంగా పంపిణి చేశారు.పీజీ ఆల్ ఇండియా ఎంట్రెన్స్‌లో 12వేల ర్యాంకు రావడంతో డాక్టర్ సాత్వికరెడ్డి 101మట్టి వినాయక ప్రతిమ లను గ్రామస్తులకు ఉచితంగా అందజేశారు. స్టేట్‌లో 500లోపు ర్యాంకు వస్తుందని హైదరాబాద్‌లోని ఉస్మానియా, గాంధీ హస్పిటల్‌లో పీజీ సీటు ఖచ్చితంగా వస్తుందని సాత్విక రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పిప్పెర సాయరెడ్డి, ఏర్రం రాజేశ్వర్, కుటుంబ సభ్యులు తదితరులు ఉన్నారు.

నిజాంసాగర్‌కు జల కళ

- ఎగువ ప్రాంతం నుంచి 15,482 క్యూసెక్కుల వరద నీరు రాక..
- వీఆర్ నెంబర్-5లో రెండు గేట్లు ఎత్తివేత..
- ప్రధాన కాలువ వెంట ఆయకట్టుకు 2,100 క్యూసెక్కుల నీరు విడుదల
- 1405 అడుగులకు గాని 1404.57 అడుగుల నీటి సామర్థ్యం
- 17.802 టీఎంసీలకు 17.181 టీఎంసీల నీటి సామర్థ్యం నిలువ



పూర్తి నీటి సామర్థ్యంతో నిజాంసాగర్ ప్రాజెక్టు



వీఆర్ నెంబర్ ఐదులోని రెండు గేట్లను ఎత్తి దిగువ మంజీరాకు నీటిని వదులుతున్న దృశ్యం

నిజాంసాగర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఉభయ జిల్లాల వరప్రదాయని నిజాంసాగర్ ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యంతో సోమవారం నాటికి నిండుకుంది. దీంతో ప్రాజెక్టు నిండు జలాలతో కనువిందు చేస్తుంది. 48 గంటల విరామం తరువాత సోమవారం ఉదయం నిజాంసాగర్ వీఆర్ నెంబర్-5 గేట్లలోని రెండు గేట్లు ఎత్తి 133.8 క్యూసెక్కులన్నిటినీ దిగువ మంజీరాలోనికి వదిలి వేస్తున్నారు. ఆయకట్టు కింద వేసిన పంటలకు లక్ష 35 వేల ఎకరాలకు ప్రధాన కాలువ ద్వారా 2,100 క్యూసెక్కుల నీటిని వదిలివేస్తున్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టులోనికి ఈనెల 18వ తేది నుంచి భారీ వరద నీరు మంజీరా వెంట రావడంతో ఈనెల 18 నుంచి 23వ తేది వరకు దాదాపు 25 టీఎంసీలన్నిటినీ మంజీరా నదిలోనికి వదిలి వేసే విషయం పాఠకులకు తెలిసిన విషయమే. సోమవారం ఉదయం నాటికి మంజీరా వెంటా వరద నీరు 15,482 క్యూసెక్కులు వస్తు ఉండటంతో నీటి పారుదల శాఖ అధికారులు వరద గేట్లు ఎత్తి 13,382 క్యూసెక్కుల నీటిని గేర్ల ద్వారా మంజీరా నదిలోనికి వదిలేస్తున్నారు. ఎగువ నుంచి భారీ వరద నీరు రావడంతో అధికారులు పూర్తి నీటి మట్టాన్ని నిలువ చేయలేకపోయారు. ఎగువ మంజీరా నుంచి వరద నీరు తగ్గుముఖం పట్టడంతో ఈ నెల 24 నుంచి నిజాంసాగర్ ప్రాజెక్టు పూర్తి నీటి మట్టాన్ని నిల్వ చేశారు. దీంతో ఉభయ జిల్లాల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు గేట్ల మూసివేత

- ప్రాజెక్టు గేట్లను మూసివేసిన అధికారులు తగ్గిన ఇన్‌ఫ్లో
- కాలువలకు కొనసాగుతున్న నీటి విడుదల



శ్రీరాంసాగర్ ప్రాజెక్టు గేట్లను మూసివేసిన దృశ్యం

మెండోర , ఆగస్టు25 (ఆంధ్రజ్యోతి): ఉత్తర తెలంగాణ జిల్లాలను సస్యశ్యామలం చేస్తున్న శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టులోకి భారీగా వ రద నీరు చేరడంతో ప్రాజెక్టు గేట్ల ద్వారా గోదావరిలోకి మిగులు జాలను విడుదల చేశారు. దీంతో ప్రాజెక్టు నీటిమట్టం గరిష్ట స్థాయికి చేరడంతో ప్రాజెక్టులోకి వచ్చిన వరద నీటిని ప్రాజెక్టు గేట్ల ద్వారా కాకతీయ, ఎస్కేప్ గేట్ల ద్వారా విడుదల చేసారు. సోమవారం ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో తగ్గడంతో ప్రాజక్టు గేట్లను మూసివేసినట్లు ప్రాజెక్టు ఈఈ చక్రపాణి తెలిపారు. ఉదయం ప్రాజెక్టులోకి 41867 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో 4 వరద గేట్ల ద్వారా 12320 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేశారు. ప్రాజెక్టులోకి స్వల్పంగా వరద తగ్గు ముఖం పట్టడంతో ప్రాజెక్టు గేట్లను మూసివేశారు. సాయంత్రం ప్రాజెక్టులోకి 29వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుంది. ప్రాజెక్టు నుంచి ఎస్కేప్ 5 గేట్ల ద్వారా 3500 క్యూసెక్కులు, కాకతీయ కాలువ ద్వారా 4500 వేల క్యూసెక్కుల, వరద కాలువ ద్వారా 20వేల క్యూసెక్కుల, సరస్వతి కాలువకు 500 క్యూసెక్కులు, నీటిని విడుదల చేసినట్లు వివరించారు. ప్రాజెక్టు నుండి ఆవిరి రూపంలో 666 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 150 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 232 క్యూసెక్కులు ఔట్ ఫ్లో పోతుందని ఈఈ తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగుల(80 టీఎంసీలు కాగా) సోమవారం సాయంత్రానికి 1090.90 అడుగుల (80 టీఎంసీల) నీటి నిల్వ ఉందన్నారు.

దిగుబడి లేక పెసర రైతుల పరేషాన్



ఉమ్మడి మద్నూర్ మండలంలో నష్టపోయిన పెసర పంట

మద్నూర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఈ ఖరీఫ్ సీజన్‌లో పెసర సాగుచేసిన రైతులపై ప్రకృతి కన్నెర్ర చేసింది. దానికి తోడు అరకొరగా రైతు చేతికొచ్చిన పంటను విక్రయించుకునే దశలో ఒక్కసారి బహిరంగ మార్కెట్‌లో ధర అ మాంతం పడిపోయింది. దీంతో పెసర రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అయినప్పటికీ మార్క్‌ఫెడ్ ఇంతవరకు కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ఎలాంటి ప్రణాళిక సిద్ధం చేయలేదు. ఇది ప్రైవేట్ వ్యాపారులకు అంది వచ్చిన అవకాశంగా మారింది. ఈ ఏడాది ఉమ్మడి మద్నూర్ మండలంలో రైతులు 1250 ఎకరాలలో పెసర పంట సాగు చేశారు. సీజన్ మొదట్లో పెసర పంట ఎంతో ఆశాజనకంగా ఉంది. ఎకరాకు ఆరేడు క్వింటాళ్ల దిగుబడి వస్తుందని రైతులు ఆశపడ్డారు. తీరా పూత, పిందె, కాయ, తయారైన తర్వాత ఎడతెరిపి లేకుండా వర్షాలు కురవడంతో వరదల్లో పంట నష్టపోయింది. దీంతో రైతుల ఆశలు ఆవిరయ్యాయి. కోత దశకు వచ్చిన పెసర పంట మొత్తం వర్షాలకు దెబ్బతింది. మి గిలిన పెసర కాయ దశలోనే రంగు మారాయి. దిగుబడి కాస్త రెండు క్వింటాళ్లకు పడిపోయింది. అయినప్పటికీ రైతులు పంటను భూమిపైన వదిలేయలేక యంత్రాలతో కోయిస్తున్నారు. ఇదే సమయంలో ఒక్కసారిగా పెసర్ల ధరలు అమాంతం పడిపోయాయి. ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ద్వారా క్వింటాలు ఒక్కింటికి రూ. 8 వేలకు పైగా ఉండగా, బహిరంగ మార్కెట్‌లో ఆ ధర రూ.5 వేలకు పడిపోయింది. అరకొరగా వచ్చిన పెసర్లు రంగు మారడంతో అమ్ముకోవడానికి రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. రైతుల కష్టాలు కన్నీళ్లను ప్రైవేట్ వ్యాపారులు సొమ్ము చేసుకునేందుకు ఒక్కసారిగా రేట్లు తగ్గించి వేశారు. ఇంత జరుగుతున్న ప్రభుత్వ ఆధీనంలోని మార్క్‌ఫెడ్ అధికారులకు చీమ కుట్టినట్లు కూడా లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎకరం ఒక్కింటికి వచ్చిన ఒకటి, రెండు క్వింటాళ్ల పెసర్లను తక్కువ ధరలకే ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించుకోవాల్సి వస్తుండటం తమ దౌర్భాగ్యం అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్క్‌ఫెడ్ అధికారులకు రైతుల ప్రయోజనాలు పట్టవా? అని నిలదీస్తున్నారు. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో పెసర్ల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయించాలని ప్రజా ప్రతినిధులను రైతులు కోరుతున్నారు.

పత్తా లేని ప్రత్యేక అధికారులు



బొమ్మన్‌దేవ్‌పల్లి గ్రామ పంచాయితీ భవనం

- పేరుకుపోతున్న చెత్తాచెదారం
- వీధుల్లో వెదజల్లుతున్న దుర్వాసన
- పట్టించుకోని పంచాయతీ కార్యదర్శులు

నసురుల్లాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో ప్రతి గ్రామానికి వివిధ శాఖ అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించారు. అయితే వారు నియామకమైన నెలలు గడుస్తున్నా ఆ వైపు కనీసం ఒక్కసారి కూడా కన్నెత్తి చూడటం లేదు. దీంతో గ్రామాలు కంపు కొడుతున్నాయి. మురికి కాలువలు నిండాయని, వీధులు కంపు కొడుతున్నాయని చెప్పుకోవడానికి ఎవరూ కానరావడం లేదు. నసురుల్లాబాద్ మండలం సంగం, బొప్పాస్‌పల్లి, బొమ్మన్‌దేవ్‌పల్లి గ్రామాల్లో మురికి కాలువలు నిండి కంపు కొడుతున్నాయి.

● **వీధులు అధ్వానం...**

వీధుల్లో మురుగు పేరుకుపోవడంతో రోగాలు పెరిగే అవకాశాలున్నాయి. అకాల వర్షాలు, ఈదురు గాలుల బీభత్సం వల్ల మురుగు కాలువలు నిండాయి. నసురుల్లాబాద్ మండలంలోని ఆయా గ్రామాల్లో పంచాయితీ కార్యదర్శులు నామమాత్రపు విధులు నిర్వహిస్తున్నారని పలువురు చెబుతున్నారు. నిత్యం వీధులు శుభ్రం చేయాల్సిన వారే కనీసం వీధుల వైపు కన్నెత్తి చూడటం లేదు. దీంతో రోడ్డుపై గడ్డి, పిచ్చి మొక్కలు మొలవడంతో దోమలకు అవాసాలుగా మారాయి. దీంతో రోడ్డుపై నడిచినా కూడా దుర్గంధం కొడుతోంది. గతంలో మురుగు కాలువలు నిండితే స్థానిక సర్పంచ్‌కు చెబితే సిబ్బందిని పంపించి శుభ్రం చేయించేవారు. కాని ఇప్పుడా పరిస్థితి కనిపించడం లేదు.

● **నిధుల కొరత ఓ వైపు**

అయితే ప్రత్యేక అధికారుల పాలన నాటి నుంచి ఇప్పటి వరకు నిధుల విడుదల కాలేదని పలువురు పంచాయతీ కార్యదర్శులు చెబుతున్నారు. తమ సొంత డబ్బులతో పనులు చేయిస్తున్నామంటున్నారు. కనీసం సిబ్బందికి జీతాలు కూడా ఇవ్వాలన్న సొంత డబ్బుల నుంచి ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు.

● **వీధులన్నీ శుభ్రం చేయించాలి**

గ్రామంలో మురుగు కాలువలు నిండిపోయాయి. పంచాయతీ సిబ్బంది పట్టించుకుని శుభ్రం చేయించాలి. పలు చోట్ల గడ్డి మొలిచి అక్కడే మురుగు ఏర్పడి కంపుకోతుతోంది. సంబంధిత అధికారులు స్పందించాలని కోరుతున్నాం.

- సాయి, నసురుల్లాబాద్

మట్టి గణపతుల ప్రతిష్ఠాపనతో పర్యావరణ పరిరక్షణ

ఆర్మూర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పండగ వచ్చిందంటే ఊరువాడలో సంబరాలు మిన్నంటుతాయి. యువకులు వాడవాడలో గణేష్ మండళ్లను ఏర్పాటు చేసి వినాయక ప్రతిమలను ప్రతిష్టిస్తారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీవోపీ) వినాయకుల ప్రతిమల స్థానంలో మట్టి వినాయకులను ప్రతిష్టించాలనే చైతన్యం ఎంతో కొంత ప్రజల్లో వచ్చింది. మట్టి గణపతులు ఏర్పాటుపై ప్రచారం చేసిన దాఖలాలు లేవు. మట్టి గణపతులను పూజిద్దామంటూ ప్రకటనలు చేశారే తప్ప ఆచరణలో మాత్రం అధికార యంత్రాంగం, స్వచ్చంద సంస్థలు ఏ మాత్రం దృష్టి సారించడంలేదు. ప్రతీ సంవత్సరం వేలాది గణనాథులను ప్రతిష్టించి పూజలు చేసిన అనంతరం చెరువులో నిమజ్జనం చేస్తారు. వీటిలో 90శాతం పైగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వినాయక ప్రతిమలు కావడంతో వాటిని చెరువులో నిమజ్జనం చేయడం వల్ల నీరు కలుషితమవుతున్నా యి. దీని వల్ల నీటిలో ఉండే జీవరాసులు నశించే ప్రమాదం ఉంది. అధిక సంఖ్యలో ప్రజలు మట్టి గణపతులను ప్రతిష్ఠించడానికి ఆసక్తి కనబరుస్తున్నారు. పీవోపీ గణపతుల ధరతో పోలిస్తే మట్టి గణపతుల ధర ఎక్కువగానే ఉంటుంది. ముఖ్యంగా ప్రజలు ఇళ్లలో పూజలు నిర్వహించి చిన్నచిన్న గణపతుల స్థానంలో మట్టి గణపతులనే కొనుగోలు చేస్తున్నారు.



విక్రయానికి సిద్ధంగా ఉన్న మట్టి గణపతులు



మట్టి గణపతి

రసాయనాలతో హానీకరం..

సాంప్రదాయంగా కొనుగోలు చేస్తున్న రంగురంగుల గణపతులు ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీవోపీ)తో తయారు చేయడం వల్ల అనేక అనార్థాలు కలుగుతాయి. పీవోపీతో జిప్స మ్, సల్ఫర్, మెగ్నిషియం, సిలికన్ అనే రసాయనాలు ఉంటాయి. గణనాథులను చెరువులో నిమజ్జనం చేసే సందర్భంలో అవి నీటిలో కరగక భూమిలో ఇంకిపోకుండా నీరు కలుషితమవుతాయి. దీని ద్వారా నీటిలోని జలచరాల మనుగడకు హానీ కలుగుతుంది. దీంతో పాటు ఆయా చెరువుల్లో స్నానాలు చేసే ప్రజలు చర్మవ్యాధుల బారిన పడే ప్రమాదం లేకపోలేదు. వినాయక విగ్రహాలకు వేసే రంగుల్లో రేడియం, సీసం కర్బణం, క్రోమియం అనే బార మూలకాలు ఉంటాయి. అవినీటిలో కలిగి జీవాలకు హానీ కలిగిస్తాయి. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన గణపతులను కొనుగోలు చేస్తే పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుంది.

మట్టి గణపతులతో ప్రయోజనాలు..

మట్టి గణపతులను ప్రతిష్టిస్తే పర్యావరణానికి మేలు చేసిన వారమవుతాం. వీటిలో కెమికల్స్ ఆర్టిఫిషియల్ రంగులు వాడకుండా మట్టితో తయారు చేయడం వల్ల ఎన్నో లాభాలు ఉన్నాయి. మట్టి గణపతులను సైతం వివిధ రూపాల్లో పెద్ద సైజ్‌లో కూడా తయారు చేసి విక్రయిస్తున్నారు. మట్టి గణపతుల తయారీలో ఎక్కువ ఫ్రెండ్లీ కలర్స్ వాడతారు. ఆకులు. పువ్వుల వల్ల ఈ రంగులు తయారవుతాయి. వీటి వల్ల ప్రమాదం ఏమి ఉండదు. మట్టి గణపతులను ప్రతిష్ఠించి చెరువులో నిమజ్జనం చేయడం వల్ల కాలుష్యన్ని అరికట్టడమే కాకుండా చెరువుల్లో పూడికతీసిన మట్టి పంటలకు ఎరువులుగా వినియోగించే అవకాశం ఉంటుంది. మట్టి గణపతులను ప్రతిష్ఠించి పర్యావరణాన్ని కాపాడాలని పర్యావరణ ప్రేమికులు, విద్యావంతులు కోరుతున్నారు.

మట్టి గణపతులతో పర్యావరణ పరిరక్షణ

- జిందం నరహరి, విశ్రాంత ఉపాధ్యాయుడు, ఆర్మూర్



మట్టి గణపతులు ప్రతిష్ఠించడం వల్ల పర్యావరణాన్ని కాపాడవచ్చు. వీటిలో రసాయనాలు ఉండవు. నిమజ్జనం సందర్భంగా చెరువులో నీరు కలుషీతం కాకుండా కాపాడవచ్చు. మట్టి గణపతులు వాడడం వల్ల నిమజ్జనం అనంతరం చెరువులోని మట్టి పంట పొలాలకు సేంద్రీయ ఎరువుగా కూడా ఉపయోగపడుతుంది. దీని వల్ల పర్యావరణాన్ని కాపాడిన వారమవుతాం. పీవోపీ గణపతుల నిమజ్జనం వల్ల చెరువుల్లోని నీరు కలుషితం కావడమే గాకుండా అందులో ఉండే చేపలు లాంటి జీవాల మనుగడకు ముప్పు వాటిల్లుతుంది. మట్టి గణపతుల ప్రతిష్ఠాపనపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలి.

సమస్యల వలయంలో రామారెడ్డి ఆర్టీసీ బస్టాండ్

● **పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు**



రామారెడ్డి బస్టాండ్

రామారెడ్డి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పేరు గొప్ప ఊరు దిబ్బగా మారింది. రామారెడ్డి ఆర్టీసీ బస్టాండ్ దుస్థితి. గతంలో రామారెడ్డి పెద్ద గ్రామ పంచాయతీగా పేరు ఉందనే నేపథ్యంలో నూతన జిల్లాల్లో భాగంగా నూతన మండలంగా రామారెడ్డి ఏర్పడింది. ఈ నేపథ్యంలో పేరుకు ప్రభుత్వ ఆర్టీసీ బస్టాండ్ అయినప్పటికీ ప్రైవేట్ బస్టాండ్‌గా నిలిచి పోతుంది. గత కొన్ని సంవత్సరాల ముందు రథాల రామారెడ్డిగా పేరు చేర్చుకున్న? నూతన జిల్లాల్లో భాగంగా కామారెడ్డి జిల్లా కేంద్రంగా మారగా రామారెడ్డి పెద్ద గ్రామ పంచాయతీ మండల కేంద్రంగా మారిపోయింది. కామారెడ్డి జిల్లా కేంద్రానికి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న రామారెడ్డి మండల కేంద్రం అభివృద్ధి చెందడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ప్రభుత్వ ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఎలాంటి సంబంధించిన వసతులు లేకపోవడంతో ప్రజలు తీవ్ర అస్వస్థతకు గురవున్నారు. బస్టాండ్ వద్ద వసతులు లేకపోవడంతో ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారు. బస్టాండ్ వద్ద ప్రజలకు భద్రత ఏర్పాట్లు కనుమరుగు అవుతున్నాయి. ఆర్టీసీ బస్టాండ్ లోనికి బస్సులు రాకపోవడంతో ప్రజలు, పాఠశాల, కళాశాలల విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. పేరుకే ఆర్టీసీ బస్టాండ్ వద్ద ప్రజలకు ఎలాంటి సంబంధం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ప్రయాణికుల భద్రత ఏర్పాట్లు లేకుంటే సర్వం బుడిదే అవుతుందని ప్రజలు ఆరోపిస్తున్నారు. బస్టాండ్ వద్ద ప్రయాణికులు మహిళలు, పెద్దలకు, విద్యార్థిని, విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. బస్టాండ్ వద్ద ప్రయివేటు దుకాణాలు, హోటళ్లు ఉండడంతో ప్రజలకు రాకపోకలకు ఆటంకం ఏర్పడుతుంది. కాగా రామారెడ్డి మండల కేంద్రం - ఇసన్నపల్లి గ్రామాల మధ్య వెలసిన దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న శ్రీ కాలభైరవ స్వామి ఆలయాని తెలంగాణ, ఆంధ్ర జిల్లాల భక్తులు హాజరవుతున్నారు. ఈ నేపథ్యంలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఎలాంటి సదుపాయాలు, సిబ్బంది లేకపోవడం, బస్సులు లోపలికి రాకపోవడంతో ప్రజలకు భద్రత, వసతుల ఏర్పాట్లు ఏ మాత్రం లేకపోతే ప్రజలకు తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు నేతృత్వంలో రామారెడ్డి మండల కేంద్రానికి రథాల రామారెడ్డి పేరు మార్చి, వసతులు లేకపోవడం, ఆర్టీసి బస్సులు, రాకపోవడంతో అంతరాయాలు లేకుండా మార్చాలని ప్రజలు కోరుతున్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రానికి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న రామారెడ్డి మండల కేంద్రంలో అనేక రకాల వసతులను కల్పించాలని ప్రజలు, యువకులు కోరుతున్నారు.

ఆయిల్‌పామ్‌తో లాభాలు ఫుల్

- ఉద్యానవనశాఖ అధికారి రాజు



ఎరువుల వాడకంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కమ్మర్‌పల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఆయిల్ పామ్ తోటల పెంపకంలో రైతులు ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక లాభాలు వస్తాయని ఉద్యానవనశాఖ అధికారి రాజు అన్నారు. సోమవారం మండలంలోని ఉప్లూర్ గ్రామంలో ఆయిల్‌పామ్ సాగుక్షేత్రంలో, స్థానిక రైతుఎదికలో మండల వ్యవసాయాధికారి రమ్యశ్రీ అధ్వర్యంలో ఆయిల్ పామ్ సాగు రైతులకు ఎరవుల యాజమాన్య పద్ధతులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంటసాగు మొదటి ఏడాది ఎస్ఎస్‌పి 1250 గ్రాములు, యూరియా 870 గ్రాములు, పొటాష్ 667 గ్రాములు. రెండవ సంవత్సరం ఎస్ఎస్‌పి 2500 గ్రాములు, యూరియా 1740 గ్రాములు, పొటాష్ 1333 గ్రాములు. మూడవ ఏడాది ఎస్ఎస్‌పి 2000 గ్రాములు, యురియా 2610 గ్రాములు, పొటాష్ 3750 గ్రాములు. సిఫారసు చేసిన ఎరువుల నాలుగు భాగాలుగా చేసుకుని ప్రతి 3 నెలలకోమారు చెట్టుకు అందించాలని సూచించారు. ఊక్ష్మపోషకాలైన బెరాన్‌ను మొక్క కు 25 గ్రాములు, మరో 5 రోజులకు మెగ్నిషియం సల్ఫేట్‌ను మొక్కకు 125 గ్రాముల చొప్పున ప్రతీ మూడు నెలలకోమారు కచ్చితంగా వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో రమేష్, రైతులు పిప్పెర అనీల్, బద్దం మోహన్ రెడ్డి, బద్దం మురలి రెడ్డి, కిష్టరెడ్డి, కొమ్ముల మురళి రెడ్డి పాల్గొన్నారు.

భీమ్‌గల్ రూరల్: మండలంలోని బడా భీమ్‌గల్, దేవక్కపేట్, తాళ్లపల్లి గ్రామంలో వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు ఆయిల్‌పామ్ పంటలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. ఈ సదస్సులో ఏఈవోలు స్నేహ, భార్గవ్, హార్టికల్చర్ అధకిఆరి రోహిత్, క్లస్టర్ ఆయిల్‌పామ్ అధికారి నగేష్, సిర్పూర్ కాగజ్ పేపర్ ఏరియా మేనేజర్ శ్రీధర్, ఆయా గ్రామాల ఆదర్శ రైతులు, రైతులు పాల్గొన్నారు.

ఇకపై సన్న బియ్యం చేతి సంచుల్లో..

● **వచ్చే నెల నుంచి అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు**



బియ్యం సంచులపై సీఎం, డిప్యూటీ సీఎం ఫొటోలు

మద్నూర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అందించే సన్న బియ్యం సరఫరా వచ్చేనెల సెప్టెంబరు మాసం నుంచి కొత్త పంతాలు సాగనుంది. వచ్చే నెల నుంచి లబ్ధిదారులకు బియ్యాన్ని ప్రత్యేకంగా తయారు చేసిన సంచుల్లో అందించనున్నారు. పర్యావరణ రహితంగా గుడ్డ కాగితంతో తయారుచేసిన చిన్న చేతి సంచుల్లో బియ్యాన్ని అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. పర్యావరణ పరిరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయి. అందులో భాగంగా ఆహార భద్రతా లబ్ధిదారులకు ప్రత్యేకంగా తయారుచేసిన బ్యాగుల్లో బియ్యాన్ని అందించేందుకు పౌరసరఫరాల శాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. ప్లాస్టిక్ సంచుల వినియోగం తగ్గించడంతో పాటు ఇతర అవసరాలకు వినియోగించుకునేలా తయారు చేయించిన చేతి బ్యాగులను ఆహార భద్రతా లబ్ధిదారులకు అందించనున్నారు. లబ్ధిదారుల కుటుంబంలో సభ్యుడికి ఆరు కిలోల చొప్పున బియ్యాన్ని పంపిణీ చేయనున్నారు. దీంతో ప్రత్యేక సంచులను ఆరు కిలోల ప్యాకింగ్‌తో సిద్ధం చేసిన బియ్యాన్ని ఎంఎల్ఎస్ పాయింట్లకు ఇప్పటికే చేరుకున్నాయి. కొన్ని కేంద్రాలకు బియ్యం నింపిన సంచులు సరఫరా జరగగా, మరి కొన్ని స్టాక్ పాయింట్లకు బియ్యం వేరుగా క్లాత్ బ్యాగులు వేరుగా అందినట్టు సమాచారం.

● **సీఎం, డిప్యూటీ సీఎం ఫొటోలతో చేతి సంచి**

ఆహారభద్రత పథకంలో భాగంగా రేషన్ బియ్యాన్ని అందించే సంచులపై సీఎం, డిప్యూటీ సీఎం, పౌరసరఫరాల శాఖ మంత్రి ఫోటోలు ముద్రించి ఉన్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫోటోలను చేతి సంచులపై ఒకవైపున ముద్రించగా మరోవైపున హస్తం పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన ఆరు గ్యారంటీలకు సంబంధించిన పథకాల వివరాలను ముద్రించారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ ఫోటో కింద అందరికీ సన్న బియ్యం ప్రజా ప్రభుత్వంతోనే సాధ్యం అనే నినాదంతో పాటు తెలంగాణ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ అని ముద్రించారు.

● **కొత్త రేషన్ కార్డుదారులకు బియ్యం పంపిణీ**

పాత రేషన్ కార్డు దారులతో పాటు నూతనంగా జారీ చేసిన కార్డుదారులకు సెప్టెంబర్ మాసం నుంచి సన్నబియ్యాన్ని అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది.

గిరిరాజ్ కళాశాలలో రెడ్ రిబ్బన్ రన్



బహుమతులను అందజేస్తున్న లెక్చరర్లు

సుభాష్‌నగర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి):హెచ్ఐవికి వ్యతిరేకంగా గిరిరాజ్ కళాశాలలో సోమవారం రెడ్‌రిబ్బన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా రెడ్ రిబ్బన్ రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ పోటీలను జిల్లా అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ దేవినాగేశ్వరి, కళాశాల ప్రిన్సిపల్ రామ్మోహన్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన 2కె రెడ్ రిబ్బన్ రన్‌లో బాలికల విభాగంలో గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల తరపున మొదటి స్థానంలో శ్రీవర్ధిని, రెండవ స్థానంలో అఖిల గెలుచుకున్నారు. బాలుర విభాగంలో ప్రథమ బహుమతిని సిద్ధార్థ్, ద్వితీయ బహుమతిని బాలాజీ గెలుపొందారు. విజేతలకు అడిషనల్ డీఎంహెచ్‌వో దేవి నాగేశ్వరి, ప్రిన్సిపల్ రామ్మోహన్‌రెడ్డి చేతుల మీదుగా బహుమతులను అందుకున్నారు. అంతేకాకుండా ఉమ్మడిజిల్లాలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారిని రాష్ట్రస్థాయిలో నిర్వహించే రెడ్ రిబ్బన్ రన్ పోటీలకు పంపడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు ఎయిడ్స్ పట్ల అవగాహన పెంచుకోవాలని వక్తలు సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అవంతి, రంగరత్నం, దండు స్వామి, రామస్వామి, వెంకటేశ్, సుధాకర్, టీబీ కోఆర్డినేటర్ రవిగౌడ్, నవీన్, జీజీ కాలేజీ ఫిజికల్ డైరెక్టర్ బాలమణి, మహేష్, స్రవంతి, ఆనంద్, బాలరాజ్, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

గిరిరాజ్ కళాశాలలో మట్టి వినాయకుల తయారీ

నిజామాబాద్ కల్చరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి):పర్యావరణహితం కోరుతూ గిరిరాజ్ కళాశాలలో విద్యార్థులకు మట్టి వినాయకుల తయారీ పోటీని నిర్వహించారు. రసాయనశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సోమవారం ఈ పోటీని నిర్వహించగా వంద మంది విద్యార్థులు స్వయంగా మట్టితో వినాయకుల విగ్రహాలను తయారు చేసి సృజనాత్మకతను చాటుకున్నారు. కళాశాల ప్రిన్సిపల్ రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ మట్టి వినాయకులు పర్యావరణ రక్షణకు తోడ్పడుతాయని ఎటువంటి సుస్థిర పద్ధతులను భవిష్యత్తు తరాలకు పర్యావరణ పరిరక్షణ పట్ల అవగాహన కల్పించడానికి దోహదపడుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప ప్రిన్సిపల్ రత్నం, విభాగాధిపతి రాజేష్, అధ్యాపకులు రాములు, రంజిత్, వెంకటరణమ, హన్మాండ్లు, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

పేదవారిని ఖాళీ చేయించొద్దు

నిజామాబాద్ కల్చరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి):నగరంలోని దొడ్డికొమురయ్య కాలనీలో గత 20 సంవత్సరాలుగా నివసిస్తున్న పేద ప్రజలను ఖాళీ చేయించవద్దని సీపీఎం రాష్ట్ర బాధ్యులు ప్రసాద్ అన్నారు. నగరంలో సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇవ్వాల్సిందిపోగా వారిని ఖాళీ చేయించేటటువంటి పద్ధతిని మానుకోవాలని అన్నారు. అదే స్థలంలో పేదవారికి ఇళ్లు కట్టించే ఏర్పాట్లు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సుజాత, కమిటీ సభ్యులు అనిత, యశోద, లక్ష్మిబాయి, రజియా, దీక్షిత, రమాబాయి, గోదావరి, జయశ్రీ, సంగీత, తదితరులు పాల్గొన్నారు.

మోపాల్‌లో విద్యార్థులకు క్రీడలు

మోపాల్/నిజామాబాద్ కల్చరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు అర్వింద్ జన్మదినం సందర్భంగా సోమవారం మండలంలోని మోపాల్ ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వివిధ క్రీడా పోటీలను బీజేపీ పార్టీ మండల అధ్యక్షుడు రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నవీన్‌రెడ్డి, లక్ష్మణ్, కిరణ్, సతీష్, మహేష్, లింబాద్రి, రామ్, నరేష్, పాల్గొన్నారు. పార్లమెంట్ సభ్యుడు ఎంపీ అర్వింద్ జన్మదినం పురస్కరించుకొని నగరంలోని దుర్గాదేవి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు విజయ్‌కృష్ణ ఎంపీ అర్వింద్ గోత్రనామాలతో పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో వేణుగోపాల్, సదాశివ, రాజేందర్, శ్రీనివాస్, గంగాధర్, రాజు, పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు కార్మిక లేబర్ కార్డును తీసుకోవాలి

సుభాష్‌నగర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి):ప్రైవేటు ఎలక్ట్రీషియన్‌లు ప్రతి ఒక్కరు లేబర్ కార్డు తీసుకోవాలని లేబర్ అసిస్టెంట్ ఆఫీసర్ నరేందర్ రాజు అన్నారు. నిజామాబాద్ ప్రభుత్వ, ప్రైవేటు ఎలక్ట్రీషియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రతి ఒక్కరు లేబర్ కార్డు తీసుకోవడం వల్ల సెంట్రల్ గవర్నమెంట్ కార్డు ఉంటుందని ఈ కార్డు ద్వారా 2లక్షల 50వేల ఇన్సూరెన్స్ ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో అధ్యక్షులు సంతోష్, వర్కింగ్ ప్రసిడెంట్ సలీమ్, పట్టణ అధ్యక్షుడు రమేష్, అజీజ్ అక్తర్ ఖాన్, లింబాద్రి, ఫిరోజ్ మహమ్మద్, లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.

టీయూ హాస్టల్స్ సమస్యలు పరిష్కరించాలి

డిచ్‌పల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి):తెలంగాణ యూనివర్సిటీ హాస్టల్స్‌లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని పిడిఎస్‌యూ తేయూ నాయకులు కే.గౌతం రాజ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ యూనివర్సిటీ చీఫ్ వార్డెన్ డా.మామిడాల ప్రవీణ్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ యూనివర్సిటీ హాస్టల్స్ లో నాసిరకమైన చికెన్ సప్లై చేస్తున్నారని చికెన్ టెండర్‌ను రద్దు చేయాలని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపి, రాజేందర్,ఉన్నారు.

రాష్ట్ర అధ్యక్షుడి కార్యక్రమానికి తరలిన నాయకులు

సిరికొండ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియామకం అయిన మొదటి సారిగా జిల్లాకు వస్తున్న రాంచందర్‌రావు సమావేశానికి సిరికొండ మండలం నుంచి కార్యకర్తలు తరలివెళ్లారు. సిరికొండ మండల అధ్యక్షులు సంజీవ్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు నక్క రాజేశ్వర్, ఓబిసి రాష్ట్ర నాయకులు రామస్వామి అధ్వార్యంలో నాయకులు సమావేశానికి తరలివెళ్లారు. మండల ప్రధాన కార్యదర్శులు బాబురావు, రాజేందర్, నాయకులు లింబాద్రి,ప్రబాకర్ తదితరులు ఉన్నారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

సుభాష్‌నగర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి):నగరంలోని శ్రద్ధానంద్ గంజ్ ఏరియాలో గుర్తుతెలియని వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదివారం రాత్రి సమయంలో ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని 3వ టౌన్ ఎస్‌హెచ్‌వో హరిబాబు తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 35-40 మధ్యఉంటుందని తెలిపారు. వివరాల కోసం 9712659839 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు గాయాలు

ఇందల్వాయి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి):మండలంలోని నూతనంగా నిర్మిస్తున్న లింగాపూర్ వాగు బ్రిడ్జి వద్ద సోమవారం ఉద యం ఆటో బోల్తా పడటంతో ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. అమ్రాద్‌కు చెందిన ఇద్దరు యువకులు ఆటోలో బేకరీకి చెందిన వస్తువులు తీసుకొని ధర్పల్లివైపు వెళ్తుండగా వంతెన వద్ద ముందర ఉన్న వాహనాన్ని దాటే క్రమంలో పక్కన ఉన్న మట్టి కుంగిపోయి ఆటో పల్టీలు కొడుతూ కిందికి పడిపో యింది. ప్రమాదంలో ఆటోలో ఉన్న ఇద్దరు యువకులు స్వల్ప గాయాలతో బయట పడినట్లు తెలిపారు.

పండుగలు శాంతియుతంగా జరుపుకోవాలి:సీఐ

రెంజల్,ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు కుల, మతాలకు అతీతంగా శాంతియుత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలని బోధన్ రూరల్ సీఐ విజయ్ బాబు అన్నారు. సోమవారం మండలంలోని సాటాపూర్ రైతు వేదికలో శాంతికమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేసే సమయంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా శాంతియుతంగా కలిసి మెలిసి నిమజ్జనం ఏర్పాట్లను పూర్తి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై, తదితరులున్నారు.

'ప్రజావాణి' వినతులను పరిష్కరించాలి

● ప్రజావాణికి 102 వినతులు

సుభాష్‌నగర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి):ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతను ఇస్తూ ఫిర్యాదులను వెంట వెంటనే పరిష్కరిం చాలని కలెక్టర్ టి.వినయ్‌కృష్ణారెడ్డి అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయ సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 102 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, హౌజింగ్ పీడీ పవన్‌కుమార్, నిజామాబాద్ ఏసీపీ రాజావెంకట్‌రెడ్డిలకు విన్నవిస్తూ అర్జీలను సమర్పించారు. ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సమస్యలను వెంటనేపరిష్కరించాలని కలెక్టర్‌అధికారులకు ఆదేశించారు.

● లైంగికంగా వేధిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

లైంగికంగా వేధిస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఎంఆర్‌పీఎస్ నగర అధ్యక్షుడు మల్లమారి సుధాకర్ ఫిర్యాదు చేశారు. నవీపేట మండలానికి చెందిన మహిళపై గత కొన్ని రోజులుగా ఓ వ్యక్తి వేధిస్తున్నాడని ఫిర్యాదు చేశారు. లైంగికంగా లొంగకపోతే అసభ్యంగా ఫోటోలు తీసి వీడియోలు పెడతానని బెదిరిస్తున్నాడని తెలిపారు. వెంటనే ఆ వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

● నారాయణ గురుకుల ఇంటర్నేషనల్ ట్రస్ట్‌కు భూమిని ఇవ్వం

ఆర్మూర్ మండలంలోని ఇస్సపల్లి గ్రామంలో నారాయణ గురుకుల ఇంటర్నేషనల్ స్కూల్ ట్రస్ట్‌కు భూమి ఇస్తున్నారని గ్రామ పంచాయతీ నోటీసు బోర్డులో పెట్టడం జరిగిందని దీనివల్ల గ్రామస్థులకు నష్టం



ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్

జరుగుతుందని వీడీసీ సభ్యులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సర్వే నెంబర్ 186లో 5 ఎకరాల 5 గుంటల భూమిని స్కూల్‌కు ఇవ్వనున్నట్లు నోటీసులు ఇచ్చారని ఈ భూమిని ఇవ్వడం వల్ల పశువులకు, పశుగ్రాసానికి ఇబ్బందిగా మారుతుందని తెలిపారు. తమకు ఈ భూమి తప్ప గ్రామంలో వేరే భూమి లేదని తెలిపారు. కలెక్టర్ స్పందించి ట్రస్ట్‌కు భూమిని ఇవ్వకుండా ఆపాలని కోరారు.వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

● సంక్షేమ హాస్టళ్ల సమస్యలను పరిష్కరించాలి

జిల్లా వ్యాప్తంగా ఉన్న సంక్షేమ హాస్టళ్ల సమస్యలను పరిష్కరించాలని పీడీఎస్‌యూ నగర నాయకులు సాయికిరణ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గురుకులాల్లో కనీస వసతులు కరువయ్యాయని మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని అన్నారు. గురుకులాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో పీడీఎస్‌యూ నాయకులు ప్రసాద్, మనోజ్, అశ్విన్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో అన్ని పుస్తకాలను అందుబాటులో ఉంచాలి

సాలూర,ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయంలో అన్ని పుస్తకాలను అందుబాటులో ఉంచాలని మాజీమంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. సాలూర మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నిర్మించిన నూతన భవనంలో గ్రంథాలయం సీఎస్సీ సెంటర్‌ను ప్రారంభించారు. విద్యార్థులకు అన్ని పుస్తకాలను, పోటీపరీక్షల పుస్తకాలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. గ్రంథాలయం ఏర్పాటు కొరకు పక్కా భవనాన్ని నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు సాలూర మండలం పలు గ్రామాలలో సోయా పంట నష్టం వాటిల్లిన విషయం రైతులు ఎమ్మెల్యే దృష్టికి చేర్చారు. పంట నష్టం నివేదికలను ప్రభుత్వానికి పంపి నష్టపరిహారం వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే అన్నారు. మండలంలో ఎలాంటి సమస్యలు ఉన్న



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కలిసికట్టుగా ఉంటూ సమస్యల పరిష్కారానికి సహకరించుకోవాలని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు నిజమైన లబ్దిదారులకు చేరువ చేయాలని కోరారు. ఎలాంటి నిర్లక్ష్యం వహించిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిజాంషుగర్స్ ఫ్యాక్టరీని తెరిపించడంపై ప్రభుత్వం సమావేశాలు ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకుంటుందని వెల్లడించారు. సాలూర మండలంలో పామాయిల్ పంటను పండించడానికి రైతులు ఉత్సహం చూపాలని అన్నారు. మంచి లాభదాయకమైన పంట అని పేర్కొన్నారు. పామాయిల్ తయారీ ఫ్యాక్టరీలను క్రయవిక్రయాల ఏర్పాటుకు కృషి చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, పీసీసీ డెలిగేట్ గంగాశంకర్, పీఏసీఎస్ చైర్మన్ చీల శంకర్, బోధన్, సాలూర మండలా అధ్యక్షులు మందర్నా రవి, నాగేశ్వర్ రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు నరేందర్ రెడ్డి, తహసీల్దార్ శశిభూషణ్, ఏఎంసీ చైర్మన్ వసంత్ రెడ్డి, బోధన్ పట్టణ అధ్యక్షులు పాషా మొయినోద్దీన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఇల్తెపు శంకర్, అల్లె రమేష్, సంజీవ రెడ్డి, డిస్కో సాయిలు, పీఏసీఎస్ సీఈవో బస్వంత్ రావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పనిభారం తగ్గించాలని ఏఈకి వినతి

ధర్పల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి):డిచ్‌పల్లి డివిజన్‌లోని గడ్కోల్, ధర్పల్లి సెక్టర్లలో పనిచేస్తున్న ఆపరేటర్ల పనిభారం తగ్గించాలని కోరుతూ సోమవారం ఏఈ నాగేశ్వర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. నలుగురు పనిచేసే చోట ఇద్దరితోనే పనిచేయిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఎస్ఈకి పలుమార్లు వినతిపత్రం అందజేసినట్లు ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. అయినప్పటికీ ఏడీఏ శ్రీనివాస్ కనీసం ముగ్గురు ఆపరేటర్లతో పనిచేయించమని అధికారులకు ఆదేశాలు జారీ చేసిన కిందిస్థాయిలో అమలు జరగడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో సీఐటీయూ ఆధ్వర్యంలో ఏఈని కలిసి వినతిపత్రం అందజేశారు. ఏఈ సానుకూలంగా స్పందించి సెప్టెంబరు 1 నుంచి 10 డ్యూటీల పని విధానాన్ని అమలు చేసే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు. అమలుకాని యెడల భవిష్యత్తు కార్యాచరణ ఉంటుందని ఈ సందర్భంగా వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు నరేష్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ ప్రభాకర్, ట్రెజరర్ మహేష్, మురళీజాదవ్, తామస్, కార్తిక్, బేలాసింగ్ రాథోడ్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

విమోచన అంశంపై వర్క్‌షాప్

డిచ్‌పల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి):తెలంగాణ విశ్వవిద్యాలయంలో న్యాయ కళాశాలలో సోమవారం జరిగిన వర్క్‌షాప్‌లో హైదరాబాద్ జిల్లా రిటైర్డ్ న్యాయాధికారి డాక్టర్ డి.హేమంత్‌కుమార్ రిసోర్స్ పర్సన్‌గా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో పెడధోరణలు జరుగకుండా చట్టాలు సహజసూత్రాలను అందిస్తాయన్నారు.అధికారము,ధనము, బంధుప్రీతికి అతీతంగా ప్రజాస్వామ్యబద్ధంగా పరిపాలన కొనసాగాలనిచట్టాలు సూచిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయకళాశాల ప్రిన్సిపల్, స్రవంతి,విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాల నివారణకు చర్యలు

సుభాష్‌నగర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి):విద్యుత్ ప్రమాదాలు జరుగకుండా విద్యుత్ సిబ్బంది ఎప్పటికప్పుడు నివారణ చర్యలు చేపడుతుందని విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ రవీందర్ అన్నారు. సోమవారం నిజామాబాద్ సర్కిల్‌లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈసందర్భంగా ఆయనమాట్లాడుతూ రైతుల సమస్యలను పరిష్కరించడానికి విద్యుత్ అధికారులు పొలం బాట అనే కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుందన్నారు.జీరోవిద్యుత్ ప్రమాదాల లక్ష్యంగా సర్కిల్‌లోని డీఈ టెక్నికల్ అధికారులను సేఫ్టీ అధికారులుగా నియమించి విద్యుత్‌ప్రమాదాలనివారణకుకృషి చేస్తున్నామని అన్నారు.

తప్పులు లేకుండా ఓటరు జాబితా సిద్ధం చేయాలి

డిచ్‌పల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి):డిచ్‌పల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో సోమవారం మండల ప్రత్యేక అధికారి మరియు జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి సాయగౌడ్, ఎంపీడీవో రాజ్‌వీర్ స్థానిక సంస్థల ఎన్నికల సంబంధించిన పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్నికల నియమ నిబంధన ప్రకారం అన్ని గ్రామపంచాయతీలలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించాలని, అలాగే ఓటర్ లిస్ట్ వార్డుల వారిగా తయారుచేసి సిద్ధంగా ఉంచాలని అన్నారు. అనంతరం ఘనపూరు గ్రామంలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓశ్రీనివాస్‌గౌడ్,పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు ఆర్థిక సహాయం

ఇందల్వాయి/ఎడపల్లి/డిచ్‌పల్లి/సిరికొండ,ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అర్వింద్ జన్మదినం సందర్భంగా సోమవారం అర్వింద్ ధర్మపురి ఫౌండేషన్ కార్యకర్త సంక్షేమ నిధి నుండి గృహప్రవేశం కోసం మండలంలోని నల్లవెల్లి గ్రామానికి చెందిన పిన్నెం నడిపి రాజన్నకు రూ.20వేల చెక్కును అందజేశారు. ప్రతి కార్యకర్తకు ఫౌండేషన్ అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమం లో పార్టీ మండల అధ్యక్షుడు సత్యనారాయణ, నాయుడు రాజన్న, కన్నెచిన్ని, రాజేందర్, మనోహర్, సాగర్, తదితరులు పాల్గొన్నారు. ఎడపల్లి మండల కేంద్రానికి చెందిన భారతీయ జనతా పార్టీ బూతు స్థాయి కార్యకర్త మంగలి శేఖర్ ఈ మధ్యనే మరణించడంతో అతని కుటుంబానికి లక్ష రూపాయల చెక్కును భారతీయ జనతా పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కందగట్ల రాంచందర్ అందజేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ పార్టీ నాయకులు మల్లెపూల శ్రీనివాస్,ఉన్నారు.డిచ్‌పల్లి మండలం రాంపూర్, దేవనగర్ గ్రామాలకు చెందిన ఇద్దరు ప్రమాదవశాత్తు మరణించడంతో ఒక్కో కుటుంబానికి ఎంపీ అర్వింద్ జన్మదినం సందర్భంగా సోమవారం అర్వింద్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.లక్ష చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో డిచ్‌పల్లి మండల అధ్యక్షుడు కర్ని చంద్రకాంత్, జిల్లా బీజేవైఎం అధ్యక్షుడు సతీష్‌రెడ్డి, మండల మాజీ వైస్ ఎంపీపీ శ్యామ్‌రావు,తదితరులు పాల్గొన్నారు. బిజెపిలో చాలా కాలం పనిచేసి చనిపోయిన సిరికొండ మండలం రామడుగు గ్రామానికి చెందిన బొక్కల భూమేశ్వర్ కుటుంబ సభ్యులు ఎంపీ ధర్మపురి అరవింద్ లక్షా రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు

నేడు సిరికొండలో టీఎల్ఎం మేళా

సిరికొండ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : సిరికొండ మండల స్థాయి టీచింగ్ లర్నింగ్ మేళాను మంగళవారం సిరికొండలో ఏర్పాటు చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి రాములు తెలిపారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటు చేసిన మేళా ఉదయం తొమ్మిది గంటల నుండి ప్రారంభించబడుతుందని ఎంఈవో తెలిపారు. ఈ మేళాకు మండలంలోని ప్రతి పాఠశాల నుండి కనీసం నాలుగు అంశాల (సబ్జెక్ట్‌లకు) ఒకటి చొప్పున పాఠశాల ఉపాధ్యాయులు తయారు చేసి తీసుకరావాలని ఆయన కోరారు.ఉపాధ్యాయులు సకాలంలో హాజరు కావాలని ఎంఈవో రాములు కోరారు.

జాతీయ సమగ్రతకు పాటు పడాలి

డిచ్‌పల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి):తెలంగాణ విశ్వవిద్యాలయంలో ఎన్ఎస్ఎస్ ప్రీరిపబ్లిక్ పరేడ్ ఎంపికలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రిజిస్ట్రార్ ఎం.యాదగిరి హాజరై ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సమాజ సేవా కార్యక్రమంలో విరివిగా పాల్గొనాలని సూచించారు. ప్రతి ఒక్క వాలంటీర్లు ప్రీ పరేడ్ ఎంపికకు పోటీ పడాలని సూచించారు. ఈ ఎంపిక కార్యక్రమానికి రాష్ట్ర ఎన్ఎస్ఎస్ యువజన అధికారి సైదా నాయక్ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రోగ్రాం అధికారులు స్వప్న, స్రవంతి, సంపత్, హలీమ్‌ఖాన్, అంజయ్య, రాంబాబు పాల్గొన్నారు.

వీడీసీ భవన నిర్మాణానికి భూమి పూజ

సిరికొండ,ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): సిరికొండ మండలం కొండాపూర్ గ్రామంలో గ్రామాభివృద్ధి కమిటీ భవన నిర్మాణానికి సోమవారం వీడీసీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు భూమి పూజ చేశారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి అడుగగానే రూ.ఐదు లక్షలు మంజూరు చేశారని కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు బుచ్చన్న తెలిపారు.ఎమ్మెల్యే నిధులు మంజూరు చేయడంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి వెల్మ బాస్కర్‌రెడ్డి కృషి ఉందని బుచ్చన్న తెలిపారు. భూమి కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షులు రమేష్,కాంగ్రెస్ నాయకులు బుచ్చన్న మాజీ సర్పంచ్ గౌసొద్దిన్,శ్రీధర్,ఆకుల జగన్, కిషోర్‌గౌడ్,చంద్రగౌడ్, పీఏసీఎస్ ఉపాధ్యక్షులు అబ్బాస్,నర్సా గౌడ్, మిద్దెల రాజు,అక్షయ్ తదితరులు పాల్గొన్నారు.

సర్వీస్ రోడ్డుకు మరమ్మతులు కరువు

డిచ్‌పల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి):గత నాలుగు సంవత్సరాల క్రితం 44వ నెంబర్ జాతీయ రహదారి పనులు చేసిన అధికారులు బెటాలియన్ నుంచి ఘన్‌పూర్ వెళ్లే సర్వీస్ రోడ్డు పనులు రోడ్డు పనులు వేయకుండా వదిలి వేయడంతో ఇటు పోలీసులు, అటు స్థానికులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. వర్షాకాలంలో గుంతలు పడిన రోడ్డులో నీళ్ల నిలవడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. జాతీయ రహదారిని రోడ్డు వేసిన అధికారులు సర్వీస్ రోడ్డును వేయకపోవడం ఎంతవరకు సమంజసమని బెటాలియన్ పోలీసులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా జాతీయ రహదారి అధికారులు సర్వీస్ రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఉద్యోగుల హక్కుల కోసం జంగ్ సైరన్ మోగించాలి

సుభాష్‌నగర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి):ఉద్యోగుల హక్కుల కోసం జంగ్ సైరన్ మోగించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు నాశెట్టి సుమన్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలోని టీఎన్‌జీవోస్ హాల్‌లో సోమవారం టీఎన్‌జీవోస్ జిల్లా సర్వసభ్య సమావేశం అత్యవసరంగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల హక్కుల కోసం రాష్ట్ర ప్రభుత్వంతో ఎప్పటికప్పుడు చర్చలు జరిపిన సమస్యల పరిష్కారంలో జాప్యం జరుగుతుందన్నారు. సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినంగా భావించి ఆయా జిల్లాల ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలపాలని అన్నారు. సీపీఎఫ్ అంతం కోసం ఏర్పాటు చేసిన ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనానికి ఉద్యోగులు తరలిరావాలన్నారు. బస్సు యాత్ర సెప్టెంబర్ 11న జిల్లా కేంద్రానికి రానుందని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీవోస్ జిల్లా కార్యదర్శి నేతికుంట శేఖర్, పోల శ్రీనివాస్, జాకీర్ హుస్సేన్, శశికాంత్, సూర్యప్రకాష్, సాయికృష్ణ, జ్ఞానేశ్వర్‌రెడ్డి, అతిక్ అహ్మద్, బి.శ్రీనివాస్, పురుషోత్తం, సలహాదారులు సుధాకర్, శ్రీనివాస్, పాల్గొన్నారు.

బోధన్‌లో మట్టి గణపతుల పంపిణీ

బోధన్,ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): మట్టి గణపతులను పూజించి పర్యావరణాన్ని కాపాడాలని లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్ సేవ ప్రతినిధులు నర్సయ్య సెటు అన్నారు. రానున్న గణేష్ పండుగ సందర్భంగా సోమవారం మట్టి గణపతులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టి గణపతులను పూజించి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. మట్టి వినాయకులను ఉపయోగించడం వల్ల ప్రకృతికి ఎలాంటి హాని ఉండదన్నారు. నీటిలో నిమజ్జనం చేసిన వెంటనే కరిగిపోతాయన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు సత్యనారాయణ, రాజేశ్వర్ రావు, వెంకటేశం, తదితరులు పాల్గొన్నారు.

జడ్పీపై కాషాయ జండా ఎగరాలి

(5వ పేజీ తరువాయి)



నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

ఓట్ చోరీ అంటూ రాహుల్‌గాంధీ చేస్తున్న వ్యాఖ్యలు ఆయన బ్రెయిన్ చోరీ అయినట్లు అర్థమవుతుందన్నారు. బీసీ రిజర్వేషన్లకు బీజేపీ అడ్డు కాదని కాంగ్రెస్ పార్టీకి బీసీలపై ప్రేమ ఉంటే మొత్తం 42 శాతం రిజర్వేషన్లు బీసీలకే ఇవ్వాలని కానీ అందులో 10 శాతం మైనార్టీలకు ఇస్తామనడం సరికాదన్నారు. మైనార్టీలకు 10 శాతం ఇస్తే బీసీలకు మిగిలేది 32 శాతమేనని కానీ బీజేపీ 46 శాతం బీసీలకు రిజర్వేషన్లు ఇస్తుందన్నారు. మతం ఆధారంగా ఇచ్చే రిజర్వేషన్లకు బీజేపీ వ్యతిరేకం అన్నారు. యూరియా విషయంలో అనవసరంగా కేంద్రంపై నిందలు వేస్తున్నారని కేంద్రం నుంచి రావాల్సిన యూరియా వచ్చిందని కేవలం బీజేపీపై నిందలు వేసేందుకే కాంగ్రెస్ కృత్రిమ యూరియా కొరతను సృష్టించిందన్నారు. కేంద్రం అన్ని విధాలా రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందని 3వేల కోట్లతో కొత్త రైల్వేలైన్, జాతీయ రహదారులు ఇచ్చిందని రేషన్ బియ్యంలో 5కిలోలు కేంద్రానిది అని, ఇందిరమ్మ ఇళ్లలోనూ కేంద్రం వాటా ఉందన్నారు. స్థానిక ఎన్నికలు నిర్వహించేందుకు కాంగ్రెస్ బయపడుతుందని అందుకే ఆలస్యం చేస్తున్నారని అన్నారు. చాలా మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు బీజేపీ వైపు చూస్తున్నారని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని ఆయన కోరారు.

ఓట్లు ఇచ్చినం.. సీట్లు ఇచ్చినం: ఎంపీ అర్వింద్

గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో ఎక్కడా దక్కని ఓటింగ్ శాతం నిజామాబాద్ పార్లమెంట్‌లో బీజేపీ పార్టీకి వచ్చిందని ఓట్లు, సీట్లు ఇచ్చిన పార్లమెంట్ పరిధిలో రాష్ట్ర కమిటీలో ఎక్కువ పదవులు ఇవ్వాలని ఎంపీ ధర్మపురి అర్వింద్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావును కోరారు. పార్లమెంట్ ఎన్నికల్లో 50 శాతం ఓటింగ్ దాటించాలని లక్ష్యంగా పనిచేస్తే 48 శాతం ఓట్లు వచ్చాయని ఒక్క జగిత్యాల నియోజకవర్గంలోనే తక్కువ శాతం ఓట్లు వచ్చాయని వచ్చే ఎన్నికల్లో 50 శాతంకు పైగా జగిత్యాలలో ఓట్లు సాధిస్తామన్నారు. తాను పొగరుబోతునని పార్టీలోకి కొత్త వారిని రానివ్వడం లేదని చేస్తున్న ప్రచారం తప్పని, గతంలో ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డిని పార్టీలోకి రాకుండా కొంత మంది అడ్డుకున్నారని ఆయన తెలిపారు. వచ్చేస్థానిక సంస్థల ఎన్నికల్లో నిజామాబాద్ జిల్లా పరిషత్ స్థానాన్ని గెలిచి అధిష్టానానికి గిఫ్ట్‌గా ఇస్తానని అదే విధంగా రాష్ట్రంలో మొదటి జడ్పీస్థానం, మున్సిపల్ స్థానాలను వచ్చే ఎన్నికల్లో గెలుచుకుంటామన్నారు. 2018 ఎన్నికల్లో 18లక్షల ఓట్లు గల్లంతు అయ్యాయని ప్రచారం జరిగితే అప్పటి పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఎందుకు గమ్మున ఉన్నారని పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ జవాబు చెప్పాలన్నారు. ఈ సమావేశానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులాచారి అధ్యక్షత వహించగా ఎమ్మెల్సీలు మల్క కొమురయ్య, అంజిరెడ్డి, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, పసుపు బోర్డు చైర్మన్ పల్లెగంగారెడ్డి, బస్వాలక్ష్మినర్సయ్య, స్రవంతిరెడ్డి, బోగశ్రావణి, జగిత్యాల బీజేపీ అధ్యక్షుడు యాదగిరిబాబు, లోకభూపతిరెడ్డి, పెద్దోళ్ల గంగారెడ్డి, వడ్డి మోహన్‌రెడ్డి, మేడపాటి ప్రకాష్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, పోతన్‌కర్ లక్ష్మినారాయణ, న్యాలంరాజు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన పదాధికారుల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడితో పాటు ఇతర నేతలు పాల్గొన్నారు.

● బీజేపీలో జోష్ నింపిన రాష్ట్ర అధ్యక్షుడు పర్యటన...

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియామకం అయిన తర్వాత మొట్టమొదటిసారి జిల్లాకు వచ్చిన రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావుకు పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. జిల్లా సరిహద్దు ఇందల్వాయి నుంచి మొదలుకొని భారీ కారు ర్యాలీతో పాటు నగరంలో భారీ బైక్‌ర్యాలీ నిర్వహించారు. నవీపేటకు చెందిన పలువురు ఇతర పార్టీల నేతలు, కార్యకర్తలు వడ్డి మోహన్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డిల ఆధ్వర్యంలో బీజేపీలో చేరగా వారిని రాష్ట్ర అధ్యక్షుడు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పెద్ద సంఖ్యలో యువకులు ఎంపీ అర్వింద్ జన్మదినాన్ని పురస్కరించుకొని రక్తదానంలో పాల్గొన్నారు.

● చెక్కులు అందజేత..

నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని బూత్ స్థాయి కార్యకర్తలకు ఎంపీ ధర్మపురి అర్వింద్ తన సొంత డబ్బులతో అందజేస్తున్న చెక్కులను ఆయన పుట్టిన రోజు సందర్భంగా అందజేశారు. బూత్‌స్థాయి కార్యకర్త మృతి చెందితే రూ.లక్ష, ఆసుపత్రి పాలైతే ఆసుపత్రి బిల్లు ఆధారంగా, గృహప్రవేశం, పెళ్లిళ్లకు రూపాయలు 20వేలు చొప్పున అందజేశారు. పార్లమెంట్ పరిధిలో సోమవారం 76 మంది 24లక్షల విలువైన చెక్కులను అందజేశారు. అర్వింద్ బూత్‌స్థాయి కార్యకర్తలకు ఆర్థిక సహాయం చేయడం సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా జన్మదినంజరుపుకుంటున్న అర్వింద్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కాగా, బూత్‌స్థాయి కార్యకర్త కుటుంబానికి చెందిన ఓ బాలుడు తాను పెయింటింగ్‌తో వేసిన అర్వింద్ చిత్రపటాన్ని ఎంపీకి అందజేశాడు.



ఎంపీకి చిత్రాన్ని అందజేస్తున్న బాలుడు

సినిమా గైడ్


దేవి : మహావతార నరసింహా (3డి తెలుగు) (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : కూలీ (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : పరదా (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహల్ : వార్-2 (తెలుగు) (11.15, 2.15, 6.15, 9.15)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్

స్క్రీన్-1 : మేఘాలు చెప్పిన ప్రేమ కథ (11.00)
: కూలీ (1.20, 4.30, 10.20)
: యూనివర్సిటీ పేపర్ లీక్ (7.40)
స్క్రీన్-2 : పరదా (11.00, 10.40)
: వార్-2 (తెలుగు) (1.30, 7.25)
: యూనివర్సిటీ పేపర్ లీక్ (4.35)
స్క్రీన్-3 : మహావతార్ నరసింహా (11.00, 1.30, 4.30, 7.30, 10.20)

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణుమాల్)

స్క్రీన్-1 : మహావతార నరసింహా (11.00, 1.50, 4.40)
: పరదా (7.30)
: వార్-2 (10.30)
స్క్రీన్-2 : కూలీ (10.00) : పరదా (1.30) : వార్-2 (4.30)
: మహావతార నరసింహా (8.05, 10.55)
స్క్రీన్-3 : వార్-2 (హిందీ) (11.15, 2.50, 6.25, 10.00)
స్క్రీన్-4 : బన్ బటర్ జామ్ (10.10)
: మేఘాలు చెప్పిన ప్రేమ కథ (1.15)
: పరదా (4.20) : కూలీ (7.20, 10.50)



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.102,600	రూ.94,800	రూ.1225

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.145	రూ.225	రూ. 245
వెన్‌కాబ్(కిలో)	రూ.150	రూ.230	రూ. 250

